# విశాల భారతి

తెలుగు దినపత్రిక

14-05-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

గురువారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 130


## ఫ్యూచర్ సిటీలోకి ఉబెర్ ఎంట్రీ



- ఉబెర్ సహకారంతో నగరంలో మల్టీలెవల్ పార్కింగ్
- స్టేషన్ల వద్ద పార్కింగ్, ఈవీ ఛార్జింగ్ కేంద్రాలు
- 30 వేల ఎకరాల ప్రాజెక్టుపై ఉబెర్ టీమ్‌కు వివరణ
- ఫ్యూచర్ సిటీలో కార్యాలయ ఏర్పాటుకు ఉబెర్ ఆసక్తి
- హైదరాబాద్‌ను ప్రధాన కేంద్రంగా మార్చాలని ఉబెర్ నిర్ణయం
- రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై హర్షం, పెట్టుబడులకు హామీ

02

## అగ్నిపర్వతంలా పేలిన బంగారం ధరలు



బంగారంపై దిగుమతి సుంకాలు అమాంతం పెంచిన కేంద్రం

తక్షణమే అమల్లోకి రావడంతో ఆకాశాన్నంటిన పసిడి ధరలు

10 గ్రాముల బంగారం ఒక్కసారిగా రూ. 1.63 లక్షల మార్కుకు చేరిక

ఒక్కరోజే సుమారు రూ. 14,000 వరకు పెరిగిన తులం బంగారం

03

## రప్పిస్తారా? తప్పిస్తారా?

### నోటీసులకు భగీరథ్ గైర్హాజరు; 15న వస్తానని వెల్లడి



బాధితురాలు మేజర్ అని పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్

బర్త్ సర్టిఫికేట్, పాస్‌పోర్ట్ ప్రకారం బాధితురాలు మైనర్

కేసులో కొత్తగా సెక్షన్ 5(1), 6 జోడించిన పోలీసులు

నేరం నిరూపితమైతే 20 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం

భరోసా కేంద్రంలో బాధితురాలి వాంగ్మూలం రికార్డు

03

## భగీరథ్‌పై లుక్ ఔట్ నోటీసులు ఇవ్వండి



- భగీరథ్ విదేశాలకు వెళ్లకుండా అడ్డుకోవాలని డిమాండ్
- నిందితుడి తండ్రి ప్రధానితో వేదిక పంచుకోవడంపై విమర్శ
- బాధితురాలి వివరాలు బయటపెట్టిన వారిపై చర్యలకు డిమాండ్
- పాలమూరు ప్రాజెక్టుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం
- 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం పోరాటం
- పాత కేసులో నాంపల్లి రైల్వే కోర్టుకు హాజరైన కవిత

03

# విశ్వగురు.. నిజాలు దాస్తున్నారా!



### అభివృద్ధి నినాదం నుండి సంక్షోభ హెచ్చరికకు మార్పు



పాలనా వైఫల్యాలను యుద్ధంపైకి నెట్టే ప్రయత్నం

ఎన్నికల కోసమే ఆర్థిక వాస్తవాల దాచివేత

సామాన్యులను పొదుపు చేయమనడంపై విమర్శలు

మార్కెట్ల పతనం, ధరల పెరుగుదలపై ఆందోళన

ప్రజలపై ఆంక్షలు, పాలకుల భోగాలపై ఆగ్రహం

**విశాలభారతి, జాతీయం:**

ప్రపంచంలో 2047 నాటికి భారత్‌ను 30 ట్రిలియన్ డాలర్ల మహా ఆర్థిక శక్తిగా నిలబెడతామంటూ నిన్నమొన్నటి వరకు గంభీర ప్రకటనలు చేసిన ప్రధాని నరేంద్ర మోదీ.. అకస్మాత్తుగా పశ్చిమాసియా యుద్ధ మేఘాల సాకుతో దేశం ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోతోందని హెచ్చరించడం విస్మయానికి గురిచేస్తోంది. వికసిత్ భారత్ నినాదంతో ఆకాశమే హద్దుగా కలలు చూపించిన పాలకుడు.. ఇప్పుడు సామాన్యులను పొదుపు పాటించాలంటూ ఉద్బోధించడం ఆర్థిక నిపుణులను సైతం నివ్వెరపరుస్తోంది. అమెరికాఇరాన్ ఉద్రిక్తతలు సరఫరా గొలుసును దెబ్బతీయడం వల్లనే ఈ దుస్థితి దాపురించిందా లేక అంతకుముందే దేశ ఆర్థిక పునాదులు బలహీనపడ్డాయా అన్న సందేహాలు ఇప్పుడు జనాన్ని తొలిచివేస్తున్నాయి. ఎంతటి క్లిష్ట సమయాన్నైనా సునాయాసంగా అధిగమిస్తానని ప్రచారం చేసుకునే విశ్వగురువు.. తీరా కష్టం వచ్చేసరికి బాధ్యత నుంచి తప్పుకుంటూ

మిగతా 2లో..

# విజేయుడు

- అసెంబ్లీ విశ్వాస పరీక్షలో విజయ్ నెగ్గారు
- 144 ఓట్లతో ప్రభుత్వం సురక్షితం
- కాంగ్రెస్, కమ్యూనిస్టులు, అన్నాడీఎంకే రెబల్స్ తోడ్పాటు
- డీఎంకే ఓటింగ్‌కు దూరంగా ఉండి వాకౌట్ చేసింది
- బీజేపీ, పళనిస్వామి తీరుపై రెబల్స్ అసమ్మతి
- ఐదేళ్ల సుస్థిర పాలనపై విజయ్ స్పష్టత

02



తమిళనాడు రాజకీయ యవనికపై కొత్త చరిత్ర లిఖిస్తూ అధికార పగ్గాలు చేపట్టిన తమిళ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్.. సవాళ్లను అవకాశాలుగా మలుచుకుంటూ దూసుకుపోతున్నారు.

## 'బేటీ బచావో' నినాదం ఏమైంది?



02

### మంత్రి కొడుకో న్యాయం, సామాన్యుడికో న్యాయమా

- పోక్సో చట్టం అమలులో బీజేపీ రెండు ప్రమాణాలు
- 'వన్ నేషన్' అనే వారు శిక్షలో ఎందుకు వివక్ష చూపుతున్నారు
- నిందితుడిని కాపాడేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది
- భేటీ బచావో నినాదంపై కేటీఆర్ సెటైర్లు
- చట్టం ముందు అందరూ సమానమని నిరూపించాలని డిమాండ్

## 'డబుల్ ఇంజిన్' అంటే పేపర్ల లీకేజీయేనా?



పేపర్ లీకేజీలతో బీజేపీ నిరుద్యోగుల భవిష్యత్తును దెబ్బతీస్తోంది

ఢిల్లీ పాలకుల అసమర్థతతో లక్షలాది మందికి అన్యాయం

గత పదేళ్లలో ప్రతి పరీక్షా పత్రం లీక్ అయిందని ఆరోపణ

కాంగ్రెస్ హయాంలో పారదర్శకంగా 70 వేల నియామకాలు

ప్రజా దర్బార్ ద్వారా నేరుగా ప్రజల సమస్యల పరిష్కారం

రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు అండగా ఉంటామని హామీ

03



## దేశ ఇంధన రంగం రాత మారబోతోంది

- బొగ్గు గ్యాసిఫికేషన్ కోసం రూ.37,500 కోట్ల పథకానికి ఆమోదం
- 2030 నాటికి 100 మిలియన్ టన్నుల గ్యాసిఫికేషన్ టార్గెట్
- బొగ్గును విలువైన, కాలుష్య రహిత ఇంధనంగా మార్చడం
- దిగుమతులు తగ్గించి 'ఆత్మనిర్భర్ భారత్' సాధించడం
- ఈ పథకం ద్వారా భారీ పెట్టుబడులు, కొత్త ఉద్యోగాల కల్పన

04

# ఫ్యూచర్ సిటీలోకి ఉబెర్ ఎంట్రీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరాన్ని విశ్వ నగరంగా తీర్చిదిద్దే క్రమంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరో కీలక అడుగు వేశారు. ప్రధాన నగరాల్లో పెను సవాలుగా మారుతున్న పార్కింగ్ గండం గట్టెక్కేందుకు అంతర్జాతీయ దిగ్గజ సంస్థ ఉబెర్ భాగస్వామ్యాన్ని ఆయన కోరారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఉబెర్ సీఈఓ దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో సీఎం సుదీర్ఘంగా భేటీ అయ్యారు. భవిష్యత్తులో వాహనాల రద్దీ అంచనాలకు మించి పెరిగే ప్రమాదం ఉందని.. దీనిని అధిగమించేందుకు వినూత్న పరిష్కారాలు అవసరమని ఆయన నొక్కి చెప్పారు. ముఖ్యంగా నగరవాసుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే క్రమంలో ట్రాఫిక్ చిక్కుముడులను విప్పడం అత్యవసరమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఉబెర్ వంటి గ్లోబల్ టెక్నాలజీ లీడర్స్ ముందుకు వస్తే మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల రూపకల్పన సులభమవుతుందని రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆలోచనలకు తగ్గట్టుగా స్పందించిన ఉబెర్ బృందం హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడం విశేషం. హైదరాబాద్ నగరం ఐటీ రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్న తరుణంలో ఉబెర్ సంస్థ ఇక్కడ తన ఉనికిని భారీగా పెంచుకుంటోంది. అమెరికా వెలుపల ఉబెర్ ఏర్పాటు చేసిన మొట్టమొదటి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భాగ్యనగరంలోనే ఉండటం గమనార్హం. ప్రస్తుతం ఇక్కడ 600 మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు పనిచేస్తూ గ్లోబల్ మార్కెట్లకు అవసరమైన సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నారని దారా ఖోస్రోషాహి ముఖ్యమంత్రికి వివరించారు. తెలంగాణలో ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యాపార అనుకూల విధానాలు తమ సంస్థ వృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయని ఆయన ప్రశంసించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉబెర్ సేవలను మరింత వేగవంతం చేసేందుకు అవసరమైన ప్రణాళికలు ఇప్పటికే సిద్ధమయ్యాయని ప్రతినిధి బృందం వెల్లడించింది. భవిష్యత్తులో హైదరాబాద్‌ను తమ కార్యకలా




పాలకు గ్లోబల్ హబ్‌గా మార్చుకోవాలనే లక్ష్యంతో ఉన్నట్లు ఉబెర్ చీఫ్ ఈ సమావేశంలో స్పష్టం చేశారు. ప్రభుత్వ సహకారం ఉంటే మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు తమ సంస్థ వెనుకాడబోదని ఆయన హామీ ఇచ్చారు. మెట్రో రైలు ప్రయాణికులు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య పార్కింగ్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గమనించారు. మెట్రో స్టేషన్ల వద్ద వాహనాలను నిలిపేందుకు తగిన చోటు లేకపోవడం వల్ల సాధారణ ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఉబెర్ బృందానికి వివరించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీలో భాగంగా మెట్రో స్టేషన్ల వద్ద మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని ఆయన సూచించారు. వీటితో పాటు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఈవీ ఛార్జింగ్ కేంద్రాలను కూడా అదే ప్రాంగణాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. పర్యావరణ హితమైన రవాణా వ్యవస్థను నిర్మించడంలో ఉబెర్ వంటి సంస్థలు కీలక పాత్ర పోషించగలవని సీఎం ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి ఇచ్చిన ఈ వినూత్న సలహాపై సమగ్రమైన అధ్యయనం చేస్తామని ఉబెర్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. నగర రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చేందుకు టెక్నాలజీని ఎలా వాడుకోవాలో త్వరలోనే ఒక నివేదిక ఇస్తామని వారు తెలిపారు. హైదరాబాద్ శివార్లలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ' గురించి ముఖ్యమంత్రి గర్వంగా వివరించారు. దాదాపు 30 వేల ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ నగరం భవిష్యత్ తరాలకు మణిహారంగా నిలుస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచంలోని టాప్ 500 దిగ్గజ కంపెనీలను ఈ ఫ్యూచర్ సిటీకి రప్పించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన చెప్పారు. ఇప్పటికే పలు అంతర్జాతీయ సంస్థలు తమ కార్యాలయాల ఏర్పాటుకు భూమిని కోరుతూ ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి కేవలం 25 కిలోమీటర్ల దూరంలోనే ఈ నగరం ఉండటం రవాణా పరంగా పెద్ద అడ్వాంటేజ్ అని ఆయన పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో వందకు పైగా కంపెనీలు పాల్గొని భారీ పెట్టుబడులు పెట్టేందుకు ఎంఓయూలు కుదుర్చుకున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ వినూత్న నగరం ఆసియాలోనే అత్యుత్తమ పెట్టుబడుల గమ్యస్థానంగా మారుతుందన్నది ప్రభుత్వ విశ్వాసం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించిన ఫ్యూచర్ సిటీ కాన్సెప్ట్‌కు ఉబెర్ సీఈఓ దారా ఖోస్రోషాహి ముగ్ధులయ్యారు. ఈ క్రమంలోనే ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ కార్యాలయాన్ని నిర్మించేందుకు ఆయన వెంటనే ఆసక్తి కనబరిచారు. ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈ నగరంలో తమ సంస్థ ఉనికిని చాటుకోవడం గర్వకారణమని ఆయన భావించారు. ఉబెర్ వంటి టెక్ దిగ్గజం ఫ్యూచర్ సిటీకి రావడం వల్ల మరిన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఇటువైపు ఆకర్షితులయ్యే అవకాశం ఉంది. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు.. మౌలిక సదుపాయాల కల్పనపై సీఈఓ తన సంతృప్తిని వ్యక్తం చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్యాలయం ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలను త్వరలోనే ఖరారు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇది కేవలం ఒక కార్యాలయంగా మాత్రమే కాకుండా ప్రపంచ స్థాయి పరిశోధనా కేంద్రంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయడం తమకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.

తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించిన తీరు ఉబెర్ ప్రతినిధులను ఆకట్టుకుంది. ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్.. ఉబెర్ ఇండియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్.. చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ ఈ చర్చల్లో చురుగ్గా పాల్గొన్నారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు షేర్డ్ మొబిలిటీని ఎలా ప్రోత్సహించాలనే అంశంపై కూడా ప్రాథమిక చర్చలు జరిగాయి. ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి ఈ భేటీలో పాల్గొని ప్రభుత్వ పరంగా కావలసిన అనుమతులపై క్లారిటీ ఇచ్చారు. పెట్టుబడిదారులకు ఎక్కడా ఎర్ర టేపు అడ్డంకులు లేకుండా గ్రీన్ కార్పెట్ స్వాగతం పలుకుతామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. ఐటీ రంగానికి ఊతమిస్తూనే మరోవైపు రవాణా చిక్కులను పరిష్కరించేలా సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. ఈ భేటీ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను గ్లోబల్ లెవల్‌లో మరింత పెంచుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో హైదరాబాద్ సిటీలో పార్కింగ్ కష్టాలకు కాలం చెల్లే సూచనలు కనిపిస్తున్నాయి. ఉబెర్ వంటి సంస్థలు కేవలం యాప్ ఆధారిత టాక్సీ సేవలకు పరిమితం కాకుండా మౌలిక సదుపాయాల కల్పనలో పాలుపంచుకోవడం శుభపరిణామం. ఫ్యూచర్ సిటీ నిర్మాణంతో హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల రూపురేఖలు మారిపోనున్నాయి. 30 వేల ఎకరాల్లో నిర్మించే ఈ భారీ ప్రాజెక్టు లక్షలాది మందికి ఉపాధి అవకాశాలను కల్పించనుంది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కంపెనీలు క్యూ కట్టడం చూస్తుంటే తెలంగాణ ఐటీ ప్రస్థానం కొత్త పుంతలు తొక్కుతోందని స్పష్టమవుతోంది. మల్టీలెవల్ పార్కింగ్.. ఈవీ స్టేషన్లు.. మెట్రో కనెక్టివిటీ వంటి అంశాలపై సీఎం చూపిన ప్రత్యేక శ్రద్ధ ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంటోంది. రాబోయే ఐదేళ్లలో హైదరాబాద్ నగరం ప్రపంచంలోని మేటి నగరాల సరసన నిలబడటం ఖాయంగా కనిపిస్తోంది. ఈ ఉత్సాహపూరిత వాతావరణం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి పోయనుంది.

## వెన్నం శ్రీకాంత్ రెడ్డికి మరో కీలక గుర్తింపు

- **జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఘన ప్రమాణ స్వీకారం**
- **మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ప్రశంసలు**
- **మానుకోటలో కాంగ్రెస్ శ్రేణుల్లో సంబరాలు**

**మహబూబాబాద్, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కేంద్రం మానుకోటలో రాజకీయ ఉత్సాహం వెల్లివిరిసింది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా వెన్నం శ్రీకాంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడంతో కాంగ్రెస్ శ్రేణులు భారీ ఎత్తున సంబరాలు నిర్వహించాయి. డప్పులు, తాళాలు, పూల వర్షం మధ్య



జరిగిన కార్యక్రమం జిల్లా రాజకీయాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రంథాలయ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ డాక్టర్ రియాజ్ చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం నిర్వహించగా సభా ప్రాంగణం నినాదాలతో మార్మోగింది. "పార్టీ కోసం కష్టపడిన నాయకుడికి సముచిత గౌరవం లభించింది" అంటూ కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

**ప్రభుత్వం ఏర్పాటులో శ్రీకాంత్ రెడ్డి కీలక పాత్ర.**

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడేందుకు గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసిన నాయకుల్లో వెన్నం శ్రీకాంత్ రెడ్డి ఒకరని కొనియాడారు. ఎన్నికల సమయంలో ప్రతి గ్రామంలో కార్యకర్తలను సమన్వయం చేస్తూ పార్టీ విజయానికి వెన్నుదన్నుగా నిలిచారని పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, "కష్టకాలంలో పార్టీ జెండా మోసిన నాయకులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ మరచిపోదు" అని అన్నారు. రాజకీయంగా నిబద్ధత, ప్రజలతో అనుబంధం, యువతలో చైతన్యం తీసుకురావడంలో శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారని ప్రశంసించారు.

**గ్రంథాలయాలను యువతకు విజ్ఞాన కేంద్రాలుగా మారుస్తాం**

చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వెన్నం శ్రీకాంత్ రెడ్డి భావోద్వేగంతో మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలుపుతూ, జిల్లాలోని ప్రతి గ్రంథాలయాన్ని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ప్రత్యేక పఠన గదులు, డిజిటల్ లైబ్రరీలు, ఆధునిక పుస్తకాల సదుపాయం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. "గ్రంథాలయం అంటే కేవలం పుస్తకాల భవనం కాదు... అది సమాజానికి దారి చూపే విజ్ఞాన దీపం" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సభలో చప్పట్ల వర్షం కురిపించాయి.

**మానుకోటలో నయా జోష్.. నాయకుల సందడి**

శ్రీకాంత్ రెడ్డి ప్రమాణ స్వీకారంతో మానుకోట పట్టణంలో కాంగ్రెస్ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం కనిపించింది. కార్యక్రమానికి హాజరైన మాజీ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే మురళీ నాయక్, డీసీసీ అధ్యక్షులు ఉమా మురళీ నాయక్, రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శి ఝాన్సీ, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి తదితరులు శ్రీకాంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. సభా ప్రాంగణం మొత్తం కాంగ్రెస్ జెండాలతో కళకళలాడగా యువకులు భారీ ర్యాలీ నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలు హారతులతో స్వాగతం పలకగా నాయకులు పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

**రాజకీయాలకు మించి ప్రజాసేవే లక్ష్యం.**

జిల్లాలో విద్యా, విజ్ఞాన రంగాలకు కొత్త ఊపిరి తీసుకురావడమే తన లక్ష్యమని శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పఠనాసక్తి తగ్గిపోతున్న నేపథ్యంలో ప్రతి మండలంలో యువత కోసం ప్రత్యేక గ్రంథాలయ చైతన్య కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

# విజేయుడు



**విశాలభారతి, జాతీయం:**

పార్టీ స్థాపన నుంచి క్షేత్రస్థాయిలో కేడర్‌ను నిర్మించుకోవడం వరకు అడుగడుగునా అవరోధాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా పోరాడారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా ఆయన ప్రతి అడుగు ఆచితూచి వేస్తూ రాజకీయ ప్రత్యర్థులను చిత్తు చేస్తున్నారు. ఇటీవల శాసనసభలో ఆయన చేసిన తొలి ప్రసంగం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ కావడమే కాకుండా.. పరిణతి చెందిన నాయకుడిగా ఆయన ఇమేజ్‌ను అమాంతం పెంచేసింది. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎంపిక విషయంలో తన మార్కు రాజకీయాలను ప్రదర్శించిన విజయ్.. అనుకున్న వ్యక్తులను ఆ కీలక పదవుల్లో కూర్చోబెట్టి తన పంతాన్ని నెగ్గించుకున్నారు. తాజాగా అసెంబ్లీలో జరిగిన బలపరీక్షలో ఘనవిజయం సాధించడం ద్వారా తన ప్రభుత్వానికి ఎదురులేదని నిరూపించారు. విజయ్ చూపిస్తున్న ఈ పొలిటికల్ గ్రిట్ చూస్తుంటే తమిళ రాజకీయాల్లో పెను మార్పులు ఖాయంగా కనిపిస్తున్నాయి. బుధవారం తమిళనాడు శాసనసభ వేదికగా జరిగిన విశ్వాస పరీక్షలో విజయ్ సర్కారు అంచనాలకు మించి రాణించి రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరిచింది. సభలో బలం నిరూపించుకోవాల్సిన సమయంలో ఏకంగా 144 ఓట్లు సాధించి తిరుగులేని మెజారిటీని ప్రదర్శించారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు, వీసీకే వంటి మిత్రపక్షాల మద్దతుతో పాటు అన్నాడీఎంకేకు చెందిన ఒక వర్గం ఎమ్మెల్యేలు విజయ్‌కు జై కొట్టడం ఇక్కడ విశేషం. అధికార పక్షం వ్యూహాలకు చిక్కిన అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలు బాహాటంగానే టీవీకేకు మద్దతు పలికి తమ విధేయతను చాటుకున్నారు. మరోవైపు ప్రధాన ప్రతిపక్షం డీఎంకే మాత్రం ఈ కీలక ఓటింగ్‌కు దూరంగా ఉంటూ సభ నుంచి వాకౌట్ చేయడం గమనార్హం. కేవలం 22 మంది అన్నాడీఎంకే సభ్యులు మాత్రమే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయడంతో విజయ్ టీమ్ ఈజీగా గట్టెక్కింది. ఈ విజయంతో విజయ్ ప్రభుత్వం తన తొలి గండాన్ని విజయవంతంగా దాటి ఫుల్ జోష్‌లో ఉంది. ఎన్నికల నగారా మోగకముందే విజయ్ తన పొలిటికల్ నెట్‌వర్క్‌ను అత్యంత చాకచక్యంగా విస్తరించుకున్నారు. అన్నాడీఎంకేలోని కీలక నేతలతో ముందే టచ్‌లోకి వెళ్లి పొత్తుల విషయంలో సుదీర్ఘ చర్చలు జరిపారు. పార్టీలోని మెజారిటీ నేతలు విజయ్‌తో చేతులు కలిపేందుకు ఆసక్తి చూపినప్పటికీ.. ఆ పార్టీ అధినేత పళనిస్వామి మొండివైఖరి వల్ల ఆ ప్రయత్నాలు కార్యరూపం దాల్చలేదు. ఇష్టం లేకపోయినా బీజేపీతో కలిసి ప్రయాణించాల్సి రావడంపై అన్నాడీఎంకేలోని ఒక వర్గం తీవ్ర అసంతృప్తితో ఉంటూ వచ్చింది. ఎన్నికల ఫలితాలు వెలువడి టీవీకే ప్రభంజనం సృష్టించడంతో ఆ అసమ్మతి జ్వాలలు ఒక్కసారిగా బహిర్గతమయ్యాయి. పళనిస్వామి నాయకత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన రెబల్ ఎమ్మెల్యేలు.. తమకంటూ ప్రత్యేక కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకుని సంచలనం సృష్టించారు. ఆ పరిణామాల కొనసాగింపుగానే ఇప్పుడు అసెంబ్లీలో విజయ్ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలిచి తమ ఆగ్రహాన్ని ప్రదర్శించారు. విశ్వాస పరీక్షలో సాధించిన ఈ మెజారిటీ కేవలం ఒక అంకె మాత్రమే కాదు.. ఇది విజయ్ రాజకీయ వ్యూహరచనకు నిదర్శనం. ముఖ్యంగా అన్నాడీఎంకే రెబల్స్ మద్దతు కూడగట్టడం ద్వారా బీజేపీ పెత్తనాన్ని సహించే ప్రసక్తే లేదని ఆ నేతలు పరోక్షంగా ఢిల్లీ పెద్దలకు సంకేతాలు పంపారు. ప్రాంతీయ ఆకాంక్షల ప్రతిబింబంగా పుట్టుకొచ్చిన టీవీకేను ఆదరించడం ద్వారా తమిళనాట కొత్త రాజకీయ ధృవీకరణకు పునాదులు పడ్డాయి. పళనిస్వామి వైఖరితో విసిగిపోయిన ఎమ్మెల్యేలకు విజయ్ ఒక ఆశాకిరణంలా కనిపించారు. దీంతోనే తమ రాజకీయ భవిష్యత్తు కోసం.. రాష్ట్ర ప్రయోజనాల కోసం విజయ్ వెంట నడవాలని వారు నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే అన్నాడీఎంకే ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకోవడంలో టీవీకే సక్సెస్ అయింది. బలపరీక్షలో నెగ్గిన తర్వాత విజయ్ ముఖంలో కనిపిస్తున్న ఆత్మవిశ్వాసం.. రాబోయే ఐదేళ్ల పాలనలో సంస్కరణల పర్వానికి నాంది పలకబోతోందని స్పష్టం చేస్తోంది. రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించడం కష్టం.. కానీ విజయ్ మాత్రం తనదైన శైలిలో పక్కా ప్లానింగ్‌తో వెళ్తున్నారు. ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు తెరవెనుక కుతంత్రాలు జరుగుతున్నాయనే ప్రచారాన్ని పటాపంచలు చేస్తూ ఏకంగా 144 ఓట్లతో పవర్‌ఫుల్ మెసేజ్ ఇచ్చారు. కేవలం మిత్రపక్షాలనే కాకుండా ప్రత్యర్థి పార్టీల్లోని అసమ్మతి నేతలను సైతం తన వైపు తిప్పుకోవడంలో ఆయన చూపిన చొరవ అద్భుతం. తన గెలుపును కేవలం అదృష్టంగా కాకుండా కష్టపడి సంపాదించుకున్న ఫలితంగా ఆయన భావిస్తున్నారు. ఐదేళ్ల పాటు స్థిరమైన పరిపాలన అందిస్తామని.. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పథకాలు రచిస్తామని ఆయన ప్రకటిస్తున్నారు. ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం చెప్పడం కంటే చేతల్లో చూపించడమే మిన్న అని ఆయన విశ్వసిస్తున్నారు. తమిళనాడు ప్రజలు కోరుకున్న మార్పు దిశగా తన ప్రయాణం సాగుతుందని ఆయన ఘంటాపథంగా చెబుతున్నారు. విజయ్ తన ప్రసంగాల్లో తరచుగా వాడే "తమిళుల ఆత్మగౌరవం" అనే నినాదం ఇప్పుడు శాసనసభలోనూ ప్రతిధ్వనిస్తోంది. స్పీకర్ ఎంపిక నుంచి విశ్వాస పరీక్ష వరకు ఆయన ప్రతి నిర్ణయంలోనూ ఆ స్ఫూర్తి కనిపిస్తోంది. తన పార్టీకి చెందిన ఇద్దరు కీలక నేతలను సభాపతి స్థానాల్లో కూర్చోబెట్టడం ద్వారా సభపై పూర్తి పట్టు సాధించారు. క్రమశిక్షణ గల నాయకుడిగా పేరు తెచ్చుకున్న ఆయన.. అసెంబ్లీలో ప్రజా సమస్యలపైనే చర్చ జరగాలని కోరుకుంటున్నారు. డీఎంకే వాకౌట్ చేయడంపై స్పందిస్తూ ప్రజాస్వామ్యంలో చర్చల కంటే పలాయనం పరిష్కారం కాదని సున్నితంగా చురకలు అంటించారు. అన్నాడీఎంకే రెబల్స్ తనకు ఇచ్చిన మద్దతును బాధ్యతగా స్వీకరిస్తానని.. వారి నమ్మకాన్ని వమ్ము చేయబోనని హామీ ఇచ్చారు. ఈ పరిణామాలు గమనిస్తుంటే విజయ్ తన రాజకీయ ఇన్నింగ్స్‌ను సెంచరీతో ప్రారంభించినట్లు కనిపిస్తోంది.

# విశ్వగురు.. నిజాలు దాస్తున్నారా!

**మొదటిపేజీ తరువాయి**

ప్రజలపై భారం వేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం తీవ్రమైతే ఏదో ఒక రోజు దేశ ఆర్థిక బుడగ పేలిపోవడం ఖాయమన్న భయం నెలకొన్న తరుణంలో.. ఐదు రాష్ట్రాల ఎన్నికల ముందు ఈ చేదు నిజాలను ఎందుకు దాచిపెట్టారనే నిలదీతలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల నగారా మోగకముందు వరకు ఇరాన్‌అమెరికా యుద్ధ సవాళ్లను భారత్ దీటుగా ఎదుర్కొంటుందని.. దేశీయంగా ఇంధన నిల్వలను సమృద్ధిగా పెంచుతున్నామని ఊదరగొట్టిన ప్రధాని.. ఓట్ల పర్వం ముగియగానే ఒక్కసారిగా మాట మార్చడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ మెజారిటీతో అధికారాన్ని చేజిక్కించుకున్న తర్వాత దేశం ఆర్థిక గండంలో ఉందని.. ప్రజలు త్యాగాలకు సిద్ధం కావాలని పిలుపునివ్వడం ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోంది. ఎన్నికల ప్రచారంలో మభ్యపెట్టే వాగ్దానాలు కురిపించి.. అధికారం దక్కగానే పొదుపు మంత్రం పఠించడం రాజకీయ అవకాశవాదమేనని విమర్శలు వినిపిస్తున్నాయి. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా పాలకుల తీరు ఉందంటూ సామాన్యులు అసహ్యించుకుంటున్నారు. ఓట్ల వేటలో వాస్తవాలను సమాధి చేసి.. తీరా గెలిచాక సంక్షోభ రాగం అందుకోవడం జనాన్ని వంచించడమేనన్న అభిప్రాయం బలపడుతోంది. ప్రజల ఆశలను ఆవిరి చేస్తూ గండం గట్టెక్కేందుకు త్యాగాల బాట పట్టాలని కోరడం బాధ్యతారాహిత్యమే అవుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థ ఒక్కసారిగా ఈ సంక్షోభంలోకి పడిపోలేదని.. నోట్ల రద్దు నాటి నుంచే లోపల గూడుకట్టుకున్న వైఫల్యాలు ఇప్పుడు బహిర్గతమవుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. పశ్చిమాసియా యుద్ధాన్ని ఒక సాకుగా చూపిస్తూ ఇన్నాళ్ల పాలనా లోపాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం జరుగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల ముందే ఈ పరిస్థితులను వివరించి ఉంటే ప్రజలు కొంత అప్రమత్తంగా ఉండేవారని.. కానీ ఓట్ల కోసమే నిజాలను దాచిపెట్టారని జనం మండిపడుతున్నారు. ముందే చెబితే ఫలితాలు ప్రతికూలంగా వస్తాయన్న భయంతోనే మోదీ మౌనం వహించారని.. ఇది పాలకుడి అసమర్థతకు నిదర్శనమని స్పష్టమవుతోంది. ప్రధాని హెచ్చరికలతో స్టాక్ మార్కెట్లు కుప్పకూలి లక్షల కోట్ల సంపద ఆవిరైపోవడం.. బ్యాంకుల్లో నగదు నిల్వల కొరత ఏర్పడటం వంటి పరిణామాలు ద్రవ్యోల్బణ సెగను పెంచుతున్నాయి. శ్రీలంక తరహా దుస్థితి భారత్‌కు కూడా ఎదురవుతుందేమోనన్న ఆందోళన ప్రతి పౌరుడినీ వెంటాడుతోంది. గత



పన్నెండేళ్ల కాలంలో మేక్ ఇన్ ఇండియా.. డిజిటల్ ఇండియా అంటూ ప్రగల్భాలు పలికిన పాలకులు.. ప్రపంచ సరఫరా గొలుసులో భారత్ కీలక భాగస్వామిగా మారిందని గొప్పలు చెప్పుకున్నారు. యూపీఐ లావాదేవీలు.. సెమీకండక్టర్ల తయారీలో రికార్డులు సృష్టించామని బిల్డప్ ఇచ్చిన సర్కారు.. ఇప్పుడు ఒక్క అంతర్జాతీయ యుద్ధంతో ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతోందని చెప్పడం ఆశ్చర్యకరంగా ఉంది. కొనుగోలు శక్తి ఆధారంగా ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగామని డప్పు కొట్టుకున్న మోదీ.. ఇప్పుడు ప్రజలను గుడ్డిగా నమ్మాలని కోరడం విడ్డూరంగా ఉంది. దేశ రక్షణ రంగ ఉత్పత్తి లక్షల కోట్లు దాటిందని.. పారిశ్రామిక ప్రగతి దూసుకుపోతోందని చెప్పిన మాటలన్నీ నీటి మూటలేనా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఆర్థిక పునాదులు పటిష్టంగా ఉంటే చిన్నపాటి గాలివాటానికే కుప్పకూలే పరిస్థితులు ఎందుకు వచ్చాయో పాలకులే సమాధానం చెప్పాలి. విశ్వగురువు ముసుగులో జరుగుతున్న ప్రచారం వెనుక అసలు సత్యం ఏమిటో ఇప్పుడు బట్టబయలవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరల పెరుగుదల వల్ల ద్రవ్యోల్బణం పెరగడం సహజమే అయినా.. దానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడంలో ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు వస్తున్నాయి. హార్ముజ్ జలసంధి వంటి కీలక మార్గాల్లో ఉద్రిక్తతలు ఉన్నాయని తెలిసినా.. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా ఇప్పుడు ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టడం సరికాదు. మూడీస్ వంటి అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీలు భారత వృద్ధి రేటు అంచనాలను తగ్గిస్తూ హెచ్చరికలు జారీ చేయడం ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. పెరిగే చమురు.. ఎరువుల సబ్సిడీల భారం ప్రభుత్వం మోయలేక ప్రజలపై రుద్దడం పాలకుల అసమర్థతే అవుతుంది. ఈ గడ్డు కాలంలో సామాన్యుడిని భయభ్రాంతులకు గురిచేసేలా సంక్షోభ మాటలు మాట్లాడటం వల్ల పెట్టుబడిదారులలో అభద్రతాభావం ఏర్పడుతోంది. ఆర్థిక నిపుణుల సలహాలను బేఖాతరు చేస్తూ ఏకపక్ష నిర్ణయాలతో దేశ ప్రగతిని పక్కదారి పట్టించడం భావ్యం కాదు. సంక్షోభ నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న పటిష్ట చర్యలేమిటో వివరించకుండా.. కేవలం పొదుపు సూత్రాలు చెప్పడం బాధ్యతల నుంచి తప్పించుకోవడమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. చమురు.. యూరియా.. బంగారం ధరలు ఆకాశాన్ని తాకుతాయని హెచ్చరిస్తున్న మోదీ.. ఆ భారాన్ని తగ్గించే దిశగా ఎలాంటి రోడ్ మ్యాప్ ప్రకటించలేదు. విదేశీ మారక నిల్వలను కాపాడుకోవాలన్న నెపంతో సామాన్యుల అవసరాలపై ఆంక్షలు విధించడం అన్యాయం. భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగితే అది తన ఘనతగా చెప్పుకునే ప్రధాని.. సంక్షోభం వస్తే మాత్రం ప్రజల బాధ్యతగా మళ్లించడం రాజకీయ చదరంగమే. నల్లధనాన్ని వెలికితీసి పేదల ఖాతాల్లో వేస్తామన్న వాగ్దానం అటకెక్కినట్లే.. ఇప్పుడు చెబుతున్న వికసిత్ భారత్ ముచ్చట కూడా నీటి బుడగలా మారుతోంది. బడాయి మాటలతో పబ్బం గడుపుకునే పాలకులకు ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెప్పడం ఖాయమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. పొదుపు మంత్రం కేవలం సామాన్య ప్రజలకేనా.. బడా కార్పొరేట్లకు.. రాజకీయ నేతలకు వర్తించదా అన్న ఆక్రోశం వ్యక్తమవుతోంది. బ్యాంకుల నుంచి లక్షల కోట్లు దోచుకుని విదేశాలకు పారిపోయిన ఆర్థిక నేరగాళ్లను పట్టుకోవడంలో విఫలమైన ప్రభుత్వం.. మధ్యతరగతి వారిపై ఆంక్షలు విధించడం శోచనీయం. పది లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిన సర్కారు.. ఇప్పుడు దేశం కోసం త్యాగాలు చేయాలని ప్రజలను కోరడం విడ్డూరం. ప్రజారవాణా వాడాలని.. బంగారం కొనవద్దని హితబోధ చేస్తున్న పాలకులు.. తమ భోగభాగ్యాలను.. విదేశీ పర్యటనలను ఎందుకు తగ్గించుకోవడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భారీ ప్రాజెక్టులకు దూరంగా ఉండాలని చెబుతూనే కేంద్ర కేబినెట్ కొత్త నిర్మాణాలకు ఆమోదం తెలపడం వైరుధ్యంగా ఉంది. త్యాగాలు సామాన్యుడికే.. భోగాలు నేతలకా అన్న చందంగా సాగుతున్న ఈ పాలనపై జనంలో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది. పాలకుల వైఫల్యాలను ప్రజలపై రుద్దే ప్రయత్నం చేస్తే ప్రజా తీర్పులో కొట్టుకుపోక తప్పదు. చట్టం.. ధర్మం అందరికీ సమానంగా ఉన్నప్పుడే ప్రజలకు వ్యవస్థపై నమ్మకం కలుగుతుంది.

# 'బేటీ బచావో' నినాదం ఏమైంది?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బీజేపీ సిద్ధాంతాలకే సవాల్ విసిరేలా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. అన్ని అంశాల్లోనూ ఏకరూపత ఉండాలని నినదించే కమలనాథులు.. తమ సొంతవారికి ఒక చట్టం, సామాన్యులకు మరో చట్టం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ముఖ్యంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ చుట్టూ ముసురుకున్న పోక్సో కేసు వివాదం రాజకీయంగా పెను దుమారాన్నే రేపుతోంది. ఒకే దేశం.. ఒకే పన్ను, వన్ నేషన్.. వన్ ఎలక్షన్ అంటూ నిత్యం నినాదాలు చేసే కేంద్ర పాలకులు.. న్యాయం విషయంలో మాత్రం ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని కేటీఆర్ నిశితంగా విమర్శించారు. అధికారం చేతిలో ఉందనే గర్వంతో చట్టాలను చుట్టాలుగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు ఇప్పుడు గల్లీ నుంచి ఢిల్లీ దాకా మార్మోగుతున్నాయి. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ నిందితులను కాపాడే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ బాహాటంగానే గళమెత్తారు. కేంద్ర మంత్రి తనయుడిపై తీవ్రమైన ఆరోపణలు వచ్చినా.. పోలీసులు అరెస్ట్ విషయంలో జాప్యం చేయడం వెనుక ఉన్న ఇన్విజిబుల్ ఫోర్స్ ఏంటో సామాన్యులకు అర్థం కావడం లేదు. పోక్సో వంటి అత్యంత కఠినమైన చట్టం కింద కేసు నమోదైనప్పుడు వెంటనే చర్యలు తీసుకోవాల్సింది పోయి.. నిందితుడికి పరారీ అయ్యే అవకాశం కల్పించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చట్టం ముందు అందరూ సమానమే అని ప్రగల్భాలు పలికే నాయకులు.. క్షేత్రస్థాయిలో తమ వారసుల అరాచకాలను కప్పిపుచ్చేందుకు యత్నించడం విడ్డూరంగా ఉంది. భగీరథ్ గత చరిత్ర చూస్తుంటే అతను నిత్యం వివాదాల్లో చిక్కుకున్నట్లు స్పష్టమవుతోంది. గతంలో కాలేజీలో తోటి విద్యార్థులపై దాడి చేసిన ఉదంతాలు ఉండటం.. ఇప్పుడు ఏకంగా మైనర్ బాలికపై వేధింపులకు పాల్పడటం చూస్తుంటే నిందితుడి సైకాలజీ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వ్యవస్థలో ఉన్న లొసుగులను వాడుకుంటూ తప్పించుకోవాలని చూడటం సభ్య సమాజానికి గొడ్డలి పెట్టు. బేటీ బచావో.. బేటీ పడావో వంటి ఆకర్షణీయమైన నినాదాలు ఇచ్చే బీజేపీ ప్రభుత్వం.. సొంత పార్టీ నేత కుమారుడు ఒక ఆడబిడ్డ జీవితంతో ఆడుకున్నప్పుడు ఎందుకు మౌనంగా ఉందో ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారం ఉంటే ఏదైనా చేయొచ్చనే ధీమాతో నేరస్థులు రెచ్చిపోతుంటే.. రక్షణ



కల్పించాల్సిన బాధ్యత కలిగిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. కేటీఆర్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసిన విమర్శలు ప్రతి పౌరుడి ఆలోచనను ప్రతిబింబిస్తున్నాయి. పోక్సో చట్టం అమల్లో ఉన్నా.. నిందితుడు మీడియా ముందుకు వచ్చి ఇంటర్వ్యూలు ఇవ్వడం, బాధితురాలి వ్యక్తిత్వాన్ని హననం చేసేలా కామెంట్స్ చేయడం చూస్తుంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుస్తోంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రాజకీయ ఒత్తిళ్ల వల్ల దర్యాప్తు సంస్థలు చేష్టలుడిగి చూడటం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా మిగిలిపోతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరి కూడా ఈ విషయంలో చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు డ్రగ్స్ కేసుల్లో సెలబ్రిటీలను వదలబోమని హెచ్చరించే సీఎం.. ఈ పోక్సో కేసులో కేంద్ర మంత్రి కుమారుడి పట్ల సాఫ్ట్ కార్నర్ ప్రదర్శిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. రాజకీయ ప్రత్యర్థులను వేధించే విషయంలో చూపించే ఉత్సాహం.. ఇలాంటి నేరస్తుల విషయంలో ఎందుకు కనిపించడం లేదని విపక్షాలు నిలదీస్తున్నాయి. రాజకీయ ప్రయోజనాల కోసం బాధితులకు అన్యాయం చేయడం తగదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉన్న ఏదో ఒక రహస్య ఒప్పందం వల్లే ఈ కేసులో కాలయాపన జరుగుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బాధితురాలు ఆత్మహత్యాయత్నం చేసినా.. నిందితుడు యథేచ్ఛగా తిరుగుతుండటం వ్యవస్థ వైఫల్యానికి పరాకాష్ట. బాధితులకు భరోసా ఇవ్వాల్సిన పాలకులు నిందితులకు కొమ్ముకాస్తున్నారనే ముద్ర పడకుండా జాగ్రత్త పడాలి. సోషల్ మీడియా వేదికగా నిందితుడిని వెనకేసుకొచ్చే బ్యాచ్ ఒకటి బాధితురాలిపైనే బురదజల్లే ప్రయత్నం చేయడం అత్యంత హేయం. హనీ ట్రాప్ వంటి పదాలు వాడుతూ నేరాన్ని డైవర్ట్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు కనిపిస్తోంది. బాధిత మైనర్ బాలిక గుర్తింపును బయటపెట్టడం చట్టరీత్యా నేరం అయినప్పటికీ.. కొన్ని యూట్యూబ్ ఛానెళ్లు, ఐటీ సెల్ కార్యకర్తలు బాహాటంగానే నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు.

# అగ్నిపర్వతంలా పేలిన బంగారం ధరలు

- బంగారంపై దిగుమతి సుంకాలు అమాంతం పెంచిన కేంద్రం
- తక్షణమే అమల్లోకి రావడంతో ఆకాశాన్నంటిన పసిడి ధరలు
- 10 గ్రాముల బంగారం ఒక్కసారిగా రూ. 1.63 లక్షల మార్కుకు చేరిక
- ఒక్కరోజే సుమారు రూ. 14,000 వరకు పెరిగిన తులం బంగారం
- మన నగరంలో 24 క్యారెట్ల తులం బంగారం రూ. 1.62 లక్షల పైమాటే
- అంతర్జాతీయ మార్కెట్లోనూ ఔన్సు 4,830 డాలర్ల రికార్డు స్థాయికి



**విశాలభారతి, జాతీయం:**

భారతీయ పసిడి ప్రియుల ఆశలపై కేంద్ర ప్రభుత్వం పెను పిడుగు వేసింది. దేశీయంగా స్వర్ణ కాంతులు ఒక్కసారిగా మసకబారేలా దిగుమతి సుంకాల అమాంతం పెంచుతూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తీసుకున్న నిర్ణయం మార్కెట్ వర్గాలను విస్మయానికి గురిచేసింది. పసిడితో పాటు వెండి, ప్లాటినం వంటి విలువైన లోహాల దిగుమతులపై కూడా ఈ ప్రభావం పడనుంది. తాజా నోటిఫికేషన్ విడుదల చేసిన వెనువెంటనే ఈ పెంచిన పన్నులు అమలులోకి రావడంతో బులియన్ మార్కెట్‌లో ధరల అగ్నిపర్వతం బద్దలైంది. ఈ నిర్ణయం సామాన్యులకు పసిడిని అందనంత ఎత్తుకు చేర్చింది. పండుగలు, వివాహాల సీజన్ ముంగిట ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య కొనుగోలుదారుల జేబులకు భారీ చిల్లు పెట్టింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో పసిడి ధరల పెరుగుదల రికార్డు స్థాయికి చేరింది. ట్రేడింగ్ ప్రారంభమైన కొద్ది సమయంలోనే బంగారం ధర ఆరు శాతానికి పైగా వృద్ధిని నమోదు చేయడం విశేషం. గడిచిన కాలంలో ఎన్నడూ లేని విధంగా ఒకే రోజు ఈ స్థాయిలో ధరలు పెరగడం ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేస్తోంది. పది గ్రాముల బంగారం ధర తొలుత రూ. 1,53,962 వద్ద లాభాలతో ప్రారంభమైనప్పటికీ, కాసేపటికే గరిష్టంగా రూ. 1,63,243 స్థాయికి చేరి రికార్డు సృష్టించింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో ఒక్కో దశలో సుమారు 13,500 రూపాయలకు పైగా లాభాన్ని నమోదు చేయడం మార్కెట్ తీవ్రతను ప్రతిబింబిస్తోంది. ఈ పెరుగుదల ధోరణి అక్కడితో ఆగకుండా 14,000 రూపాయల మార్కును తాకడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్లలోనూ పసిడి ధరల సెగలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కామెక్స్ ఎక్స్ఛేంజ్‌లో పసిడి ఔన్సుకు 4,830 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతూ ప్రపంచ వ్యాప్త డిమాండ్‌ను చాటుతోంది. దేశీయంగా పెరిగిన సుంకాలు అంతర్జాతీయంగా ఉన్న అనిశ్చితి తోడవడంతో ధరలు నియంత్రణ లేకుండా సాగుతున్నాయి. పెట్టుబడిదారులు సురక్షితమైన మార్గంగా పసిడిని ఎంచుకోవడం కూడా ఈ అమాంతం పెరుగుదలకు ఒక కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు. దిగుమతి సుంకాల పెంపు వల్ల దేశీయ మార్కెట్లకు సరఫరా తగ్గే అవకాశం ఉండటంతో ధరలు భవిష్యత్తులో కూడా ఇదే స్థాయిలో ఉండే అవకాశం కనిపిస్తోంది. పసిడి ధరలు 1,60,000 మార్కును అధిగమించడం మార్కెట్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. దేశ రాజధాని ఢిల్లీ నుంచి గులాబీ నగరం జైపూర్ వరకు పసిడి ధరలు మంట పుట్టిస్తున్నాయి. ఈ నగరాలలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,51,500గా నమోదైంది. నాణ్యమైన 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,63,090 వద్ద ట్రేడ్ అవుతోంది. సాధారణంగా ఉండే ధరల కంటే ఈ పెరుగుదల వినియోగదారులను దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. అటు అహ్మదాబాద్ నుంచి పూణే వరకు కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ నగరాలలో 22 క్యారెట్ల పసిడి రూ. 1,51,450 పలకగా, 24 క్యారెట్ల ధర రూ. 1,63,990 స్థాయిని తాకింది. ఈ గణాంకాలు దేశవ్యాప్తంగా పసిడి మార్కెట్ ఏ విధంగా అస్థిరతకు గురైందో స్పష్టంగా తెలియజేస్తున్నాయి. దక్షిణాది ప్రధాన నగరాలైన హైదరాబాద్, ముంబై, చెన్నై, బెంగళూరులో పసిడి ధరలు దాదాపు ఒకే తీరుగా కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతాలలో 22 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ. 1,51,400గా స్థిరపడింది. 24 క్యారెట్ల పసిడి ధర రూ. 1,62,990 వద్ద అమ్మకాలను జరుపుకుంటోంది. దక్షిణాదిలో వివాహాల కోసం బంగారం కొనుగోలు చేసే వారి సంఖ్య అత్యధికంగా ఉండటంతో ఈ ధరల పెరుగుదల ఇక్కడి మధ్యతరగతి కుటుంబాలపై తీరని ప్రభావాన్ని చూపుతోంది. అటు తూర్పు భారత్ లోని కోల్‌కతాలో కూడా పసిడి రేట్లు ఆకాశాన్నంటాయి. అక్కడ 22 క్యారెట్ల ధర రూ. 1,53,400 కాగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,62,830గా నమోదైంది. ముంబై మెట్రో నగరం పసిడి ధరల పెరుగుదలలో తనదైన దూకుడును ప్రదర్శించింది. ఆర్థిక రాజధానిలో 24 క్యారెట్ల బంగారం ధర రూ. 16,789గా నమోదైంది. 22 క్యారెట్ల విషయానికి వస్తే రూ. 15,390 వద్ద ట్రేడ్ అవుతోంది. తక్కువ స్వచ్ఛత కలిగిన 18 క్యారెట్ల బంగారం ధర సైతం రూ. 12,592 స్థాయికి చేరిందంటే మార్కెట్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ముంబై జ్యువెలరీ అసోసియేషన్ వర్గాలు ఈ ఆకస్మిక సుంకాల పెంపును జీర్ణించుకోలేకపోతున్నాయి. వ్యాపార లావాదేవీలు ఒక్కసారిగా స్తంభించిపోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారులు కూడా షాపుల వైపు రావడానికి భయపడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. చెన్నై నగరంలో పసిడి ధరలు దేశంలోనే అత్యధిక స్థాయిలలో ఒకటిగా నమోదయ్యాయి. అక్కడ 24 క్యారెట్ల బంగారం ధర రూ. 16,800 వద్ద కొనసాగుతోంది. 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర రూ. 15,400గా ఉంది. 18 క్యారెట్ల పసిడి రూ. 12,860 వద్ద విక్రయించబడుతోంది. పసిడి ధరలు లక్ష దాటిన తర్వాత కూడా ఆగకుండా పరుగులు తీయడం పట్ల తమిళనాడు వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. సుంకాల పెంపు వల్ల సామాన్యులకు బంగారం అందని ద్రాక్షలా మారిపోయింది. వెండి ధరలు కూడా ఇదే బాటలో సాగుతూ కేజీ వెండి ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ వల్ల కేవలం బంగారంపైనే కాకుండా ఇతర విలువైన లోహాలపై కూడా భారం పెరిగింది. ప్లాటినం దిగుమతులు కూడా ఖరీదైనవిగా మారాయి. పారిశ్రామికంగా వినియోగించే వెండి ధరలు సైతం ఈ నిర్ణయం వల్ల ప్రభావితమయ్యాయి. దేశీయంగా లోహాల కొరత రాకుండా చూసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నా ఆర్థికంగా ఇది సామాన్యులపై భారంగా పరిణమించింది. లోటును తగ్గించుకునే చర్యల్లో భాగంగానే దిగుమతులను నియంత్రించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు ఆదాయం పెరిగే అవకాశం ఉన్నప్పటికీ మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింటోంది. పసిడి మార్కెట్‌లో నెలకొన్న ఈ తీవ్ర ఒడిదుడుకులు దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు కొంత లాభసాటిగా అనిపించినా కొత్తగా కొనుగోలు చేసే వారికి మాత్రం శాపంగా మారాయి. ఎంసీఎక్స్ లో బంగారం ధరలు రికార్డు స్థాయిలో లాభాలను పంచడంతో ఆ రంగంలో ట్రేడింగ్ చేసే వారు లాభాల బాటలో ఉన్నారు. గరిష్ట స్థాయిలో ధరలు ఉన్నప్పుడు అమ్మకాలు జరిపి లాభాలను స్వీకరించే ధోరణి కనిపిస్తోంది. కానీ నగల వ్యాపారులు మాత్రం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఆర్డర్లు రద్దవుతుండటం, కొత్తగా ఆభరణాల తయారీకి గిరాకీ తగ్గడం వల్ల ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని వారు వాపోతున్నారు. పసిడి దిగుమతులపై ఆధారపడిన భారత మార్కెట్ ఈ సంక్షోభం నుంచి ఎలా బయటపడుతుందో చూడాలి. నిత్యం మారే పసిడి ధరలపై ప్రభుత్వ నియంత్రణ కంటే పన్నుల ప్రభావమే ఎక్కువగా కనిపిస్తోంది. రూపాయి విలువ పతనం అవ్వడం కూడా పసిడి ఖరీదైన లోహంగా మారడానికి ఒక కారణం. విదేశీ మారక ద్రవ్య నిల్వలను కాపాడుకోవడానికి ప్రభుత్వం ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. అయితే సామాజికంగా చూస్తే పసిడిపై భారతీయులకు ఉన్న మక్కువ తగ్గడం లేదు. ధరలు పెరిగినా సెంటిమెంట్ పరంగా కొనుగోళ్లు జరిగే అవకాశం ఉన్నా పరిమాణం తగ్గే అవకాశం ఉంది. సామాన్యుల పొదుపు మొత్తాలు ఇప్పుడు పసిడి వైపు మళ్లడం కూడా కష్టతరం కానుంది. ముున్ముందు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని బులియన్ నిపుణులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం, భౌగోళిక రాజకీయ పరిస్థితులు మారడం వల్ల పసిడి ధరలపై ఒత్తిడి పెరుగుతోంది. పది గ్రాముల ధర రూ. 1,60,000 మార్కును సునాయాసంగా దాటేయడం వల్ల రాబోయే రోజుల్లో రూ. 1,70,000 దిశగా పయనించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని విశ్లేషణలు వెలువడుతున్నాయి. మొత్తం మీద కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పసిడి ప్రియులకు చేదు అనుభవాన్ని మిగిల్చింది. మార్కెట్లో ధరలు ఎప్పుడు తగ్గుతాయో అనే విషయంలో ఎవరూ స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని సమీక్షించుకోవాలని వ్యాపార వర్గాలు కోరుతున్నాయి.

# భగీరథ్‌పై లుక్ ఔట్ నోటీసులు ఇవ్వండి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తనయుడిపై తక్షణమే లుక్ ఔట్ నోటీసులు జారీ చేసి.. అతను విదేశాలకు పారిపోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బుధవారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె ఘాటుగా స్పందించారు. భగీరథ్‌పై అత్యంత తీవ్రమైన ఆరోపణలు ఉన్నప్పటికీ.. స్వయంగా ప్రధానమంత్రి పాల్గొన్న వేదికపై నిందితుడు ప్రత్యక్షమవ్వడం ప్రజాస్వామ్యవాదులను విస్మయానికి గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి సభ్యులపై ఇన్ని ఆరోపణలు వెల్లువెత్తుతున్న తరుణంలో.. కనీస నైతికత లేకుండా ఆ సభకు హాజరుకావడం దేనికి సంకేతమని ఆమె ప్రశ్నించారు. సమాజంలో పలుకుబడి ఉన్న పెద్దల పిల్లలు ఎలాంటి అకృత్యాలకు పాల్పడినా చట్టం చుట్టంలా మారిపోతుందనే అపసవ్యమైన సందేశం ఈ ఘటన ద్వారా ప్రజల్లోకి వెళ్లిందని విమర్శించారు. నిందితులను విదేశాలకు దాటించి రక్షణ కల్పించడం బీజేపీకి మొదటి నుంచీ వెన్నతో పెట్టిన విద్య అని కవిత దుయ్యబట్టారు. గతంలో ప్రజ్వల్ రేవణ్ణ ఉదంతంలో కూడా ఇదే తీరును అవలంబించారని గుర్తు చేస్తూ.. ఇప్పుడు బండి సంజయ్ కుమారుడి విషయంలోనూ అదే పునరావృతమయ్యేలా కనిపిస్తోందని హెచ్చరించారు. ఈ క్రమంలోనే తక్షణమే నిందితుడిపై లుక్ ఔట్ నోటీసులు ఇవ్వాలని కోరారు. కొందరు సోషల్ మీడియా వేదికగా ఈ సమస్య పరిష్కారమైందంటూ తప్పుడు బిల్డప్ ఇస్తున్నారని మండిపడ్డారు. బాధితురాలు ఒక మైనర్ బాలిక అన్న విషయాన్ని విస్మరించి ఇష్టానుసారంగా పోస్టులు పెడుతున్న తీరును ఆమె ఎండగట్టారు. మన సమాజంలో మగపిల్లల తప్పులను చాలా సులభంగా విస్మరిస్తారని.. అదే ఆడపిల్లల విషయానికి వస్తే అత్యంత కఠినంగా వ్యవహరిస్తారని వ్యాఖ్యానించారు. ఈ వివక్షపూరిత ధోరణి మారాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె నొక్కి చెప్పారు. దురదృష్టవశాత్తూ బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం ప్రదర్శించిన అత్యుత్సాహం వల్ల బాధితురాలి ఫొటోలు బహిర్గతమవ్వడంపై కవిత తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి సున్నితమైన అంశాల్లో బాధితుల వివరాలు బయటకు రావడం వల్ల వారి భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతుందని ఆందోళన చెందారు. నిబంధనలను ఉల్లంఘించి ఫొటోలను షేర్ చేసిన ఖాతాలను వెంటనే గుర్తించి.. వారిపై ఉక్కుపాదం మోపాలని పోలీసులను కోరారు. తాను ఈ అంశంలో రాజకీయ లబ్ధి కోసం మాట్లాడటం లేదని.. ఒక మహిళగా బాధితురాలికి న్యాయం జరగడమే తన ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనపై స్పందిస్తూ.. రాష్ట్రానికి ఏదైనా మేలు జరుగుతుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందని పేర్కొన్నారు. కేవలం పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు నిధుల వర్షం కురిపించి.. తెలంగాణకు మాత్రం పొదుపు పాఠాలు చెప్పడం కేంద్ర వివక్షకు పరాకాష్ట అని విమర్శించారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న మొండి వైఖరిని కవిత తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జాతీయ హోదా కోసం ప్రధానమంత్రికి తక్షణం లేఖ రాయాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. గతంలో 16 రాష్ట్రాల్లోని ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించిన కేంద్రం.. తెలంగాణకు ఎందుకు మొండిచేయి చూపుతోందని ప్రశ్నించారు. ఈ అన్యాయంపై తమ పోరాటం ఆగదని.. రాష్ట్ర నీటి హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంటులో ఆమోదం తెలపాలని కోరుతూ.. సామాజిక న్యాయం విషయంలో బీజేపీ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని విమర్శించారు. తెలంగాణ గడ్డపై నీటి వాటా కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని పునరుద్ఘాటించారు. దేశవ్యాప్త జనగణన ప్రక్రియలో కుల గణనను తప్పనిసరిగా చేర్చాలని కవిత డిమాండ్ చేశారు. సామాజిక సమీకరణాలు.. ఉపవర్గాల వివరాలు స్పష్టంగా తెలిసినప్పుడే సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయికి చేరుతాయని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీసీ మహిళలకు ప్రత్యేక కోటా కల్పించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటు వెనుక ఉన్న ప్రధాన ఆకాంక్షలు నీళ్లు.. నిధులు.. నియామకాలేనని గుర్తు చేస్తూ.. గోదావరి, కృష్ణా నదుల నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడంలో ప్రస్తుత పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వాలు భారీ నిధులు ఖర్చు చేసినా నీటి వినియోగ వ్యవస్థలో లోపాలు ఉన్నాయని అంగీకరిస్తూనే.. తాము అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్ ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో నీటి నిర్వహణ కోసం ప్రతి 3000 ఎకరాలకు ఒక లష్కర్‌ను నియమిస్తామని స్పష్టం చేశారు. పార్టీ బలోపేతం కోసం ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న జెండా పండుగ కార్యక్రమం పార్టీ నిర్మాణానికి పటిష్టమైన పునాది వేస్తుందని కవిత ధీమా వ్యక్తం చేశారు. వివిధ నియోజకవర్గాల్లో పర్యటించి కేడర్‌లో జోష్ నింపుతానని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికే భవిష్యత్తులో కీలక పదవులు దక్కుతాయని స్పష్టం చేశారు. బీసీలకు విద్య.. ఉద్యోగ.. రాజకీయ రంగాల్లో 50 శాతం రిజర్వేషన్ల సాధన కోసం జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని నడిపిస్తామని ప్రకటించారు. ఇక విద్యా వ్యవస్థను కుదిపేస్తున్న నీట్ పేపర్ లీక్ ఉదంతంపై కూడా ఆమె తీవ్రంగా స్పందించారు. అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన కాలంలోనూ పేపర్ లీకేజీలు ఆపలేకపోవడం కేంద్ర ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని మండిపడ్డారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కామారెడ్డిలో గతంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కోరుతూ నిర్వహించిన రైల్ రోకో కేసులో భాగంగా కవిత బుధవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. సెకండ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు వ్యక్తిగతంగా హాజరైన ఆమె.. విచారణ అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రజల కోసం పోరాడుతుంటే ఎన్ని కేసులు పెట్టినా వెనకడుగు వేయబోనని స్పష్టం చేశారు. బీసీల హక్కుల సాధన కోసం అవసరమైతే మరోసారి నిరవధికంగా రైలు పట్టాలపై కూర్చోవడానికి కూడా సిద్ధమని ప్రకటించారు. ఈ కేసు తదుపరి విచారణను న్యాయస్థానం జూలై 17కి వాయిదా వేసింది. రాజకీయ అణిచివేతలకు.. తప్పుడు కేసులకు భయపడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు.. తెలంగాణ హక్కులు సిద్ధించే వరకు తమ పోరాట బావుటా ఎగురుతూనే ఉంటుందని కవిత తన ప్రసంగాన్ని ముగించారు.



# రప్పిస్తారా? తప్పిస్తారా?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కేంద్రసహాయమంత్రి బండి సంజయ్ తనయుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. బాధిత మైనర్ బాలిక కుటుంబం అత్యంత ధైర్యంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా.. విచారణలో అనేక విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడి ప్రవర్తన, అతని స్ప్లిట్ పర్సనాలిటీ, సోషల్ మీడియాలో అతను సాగించిన విన్యాసాలు చూస్తుంటే అధికారం తలకెక్కిన వైనం స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణ పౌరులకు రక్షణ కల్పించాల్సిన వ్యవస్థలు.. ఇలాంటి హై ప్రొఫైల్ కేసుల్లో ఎలా వ్యవహరిస్తాయనేది ఇప్పుడు ప్రజాక్షేత్రంలో చర్చనీయాంశంగా మారింది. విచారణాధికారులు ఈ ఉదంతాన్ని ఎంత లోతుగా తవ్వుతారో వేచి చూడాల్సిందే. నిందితుడి వెనుక ఉన్న రాజకీయ ఛత్రచ్ఛాయలు బాధితులకు న్యాయం జరగకుండా అడ్డుపడతాయా అనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. చట్టం తన పని తాను చేసుకుపోతుందో లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతుందోనని సామాన్యులు ఆసక్తిగా గమనిస్తున్నారు. నిందితుడి గతాన్ని పరిశీలిస్తే అతను ఒక హ్యాబిచువల్ అఫెండర్‌గా కనిపిస్తున్నాడని తాజా విశ్లేషణలు చెబుతున్నాయి. గతంలో కాలేజీ రోజుల్లో ఇతర విద్యార్థులపై భౌతిక దాడులు చేయడం, గ్యాంగులను మెయింటైన్ చేయడం వంటి ఉదంతాలు అతని దూకుడు స్వభావాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ముఖ్యంగా ఒక మైనర్ బాలికను ప్రేమ పేరుతో వంచించి.. ఫిజికల్ అబ్యూస్‌కు పాల్పడటం అత్యంత దారుణమైన విషయం. బాధితురాలు ఆ ఒత్తిడిని భరించలేక రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేయడం ఈ సమస్య తీవ్రతను చాటి చెబుతోంది. ఒక తండ్రిగా కేంద్ర మంత్రి తన కుమారుడిని సరైన మార్గంలో పెట్టాల్సింది పోయి.. బాధితులనే కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్యంలో గర్హనీయం. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వారు ఇలాంటి సున్నితమైన అంశాలలో ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా శిక్షార్హులనే సంకేతాలు పంపాల్సిన నాయకులు.. సొంతవారిని వెనకేసుకొచ్చినప్పుడు వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లుతుంది. రాజకీయంగా విమర్శలు గుప్పిస్తున్న నాయకులు వాస్తవానికి వచ్చేసరికి ఒకే వేదికపై చిరునవ్వులు చిందించడం బాధిత కుటుంబానికి తీవ్ర నిరాశను మిగిల్చింది.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకవైపు అల్లు అర్జున్ వంటి స్టార్ల విషయంలో చట్టం అందరికీ సమానమని చెబుతూనే.. మరోవైపు నిందితుడి తండ్రిని "ప్రియ మిత్ర" అని సంబోధించడం విడ్డూరంగా ఉంది. ఈ దోస్తీ వెనుక ఉన్న మర్మమేంటో సామాన్య జనానికి అర్థం కావడం లేదు. పోక్సో చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకోవడంలో పోలీసులు జాప్యం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికార పక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా రాజకీయ నేతల మధ్య ఉండే ఈ లోపాయికారి ఒప్పందాలు బాధితుల పాలిట శాపంగా మారుతున్నాయి. ప్రజా ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమనే ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. ఇది ప్రజాస్వామ్య విలువలకే గొడ్డలి పెట్టుగా పరిణమించే ప్రమాదం ఉంది. ఈ కేసులో సిట్ ఏర్పాటు చేయడం నిందితుడిని కాపాడటానికేనా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఆధారాలు బలంగా ఉన్నప్పుడు.. నిందితుడు పరారీలో ఉన్నాడని పోలీసులు ప్రకటించడం వెనుక ఉన్న రాజకీయ ఒత్తిడిని కొట్టిపారేయలేము. నిందితుడు పోలీసులకు దొరకకుండా కొన్ని యూట్యూబ్ ఛానళ్లకు ఇంటర్వ్యూలు ఇవ్వడం.. బాధితురాలి ప్రైవేట్ ఫొటోలను లీక్ చేయడం వంటివి వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతున్నాయి. విక్టిమ్ బ్లేమింగ్ చేస్తూ బాధితులనే తప్పుబట్టే ప్రయత్నం చేయడం సభ్యసమాజం తలదించుకోవాల్సిన విషయం. దర్యాప్తు సంస్థలు నిష్పక్షపాతంగా వ్యవహరించకుండా కాలయాపన చేయడం వల్ల సాక్ష్యాలు తారుమారయ్యే అవకాశం ఉంది. సాంకేతిక ఆధారాలు అందుబాటులో ఉన్నా అరెస్టుకు వెనుకడుగు వేయడం చూస్తుంటే వ్యవస్థలను ఎంతగా మేనేజ్ చేస్తున్నారో అర్థమవుతోంది. ఇలాంటి వైఖరి సమాజంలో నేరస్తులకు మరింత ధైర్యాన్ని ఇస్తుంది. సోషల్ మీడియాలో ఈ ఇష్యూని తప్పుదోవ పట్టించడానికి పెద్ద ఎత్తున కవర్ డ్రైవ్స్ సాగుతున్నాయి. బాధితురాలి గుర్తింపును బయటపెట్టడం పోక్సో చట్టం ప్రకారం తీవ్రమైన నేరం అయినప్పటికీ.. కొన్ని మీడియా సంస్థలు బాహాటంగానే ఆ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి. హనీ ట్రాప్ అంటూ కొత్త కథనాలు వండి వార్చడం ద్వారా నిందితుడికి క్లీన్ చిట్ ఇచ్చే ప్రయత్నం జరుగుతోంది. చైల్డ్ రైట్స్ కమిషన్ ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని బాధితురాలికి న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. కేవలం అధికారం.. పలుకుబడి ఉన్నాయనే కారణంతో నేరస్తులు తప్పించుకోకూడదు. బాధితురాలి వ్యక్తిత్వాన్ని హననం చేసేలా సాగుతున్న ఈ ప్రచారం వెనుక ఉన్న అసలు శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలి. సామాజిక మాధ్యమాల్లో పెచ్చరిల్లుతున్న ఈ విపరీత ధోరణికి అడ్డుకట్ట వేయకపోతే బాధితులు న్యాయం కోసం ముందుకు రావడానికి భయపడతారు. తెలంగాణలో న్యాయం జరుగుతుందని నమ్మి ముందుకు వచ్చిన ఆ కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చే భరోసా ఏంటో తేలాలి. ప్రధానమంత్రి పర్యటన సమయంలోనే ఇలాంటి ఘటనలు జరగడం.. కేంద్ర రాష్ట్రప్రభుత్వాల మధ్య ఉన్న అంతర్గత ఒప్పందాలపై అనుమానాలను కలిగిస్తోంది. ప్రజలు ఈ విషయాన్ని నిశితంగా గమనిస్తున్నారు. ఒక ఆడబిడ్డకు జరిగిన అన్యాయంపై రాజకీయాలకు అతీతంగా స్పందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. చట్టం తన పని తాను చేయడమే కాకుండా.. అది చేస్తున్నట్లు ప్రజలకు కనిపించినప్పుడే వ్యవస్థపై నమ్మకం కలుగుతుంది. బాధితులకు అండగా నిలవాల్సిన బాధ్యతను పాలకులు విస్మరిస్తే ప్రజా పోరాటాలు తప్పవు. కేసును పక్కదారి పట్టించే ప్రయత్నాలను అడ్డుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు ఐక్యంగా ఉద్యమించాల్సిన తరుణం ఆసన్నమైంది. న్యాయం జరగడంలో జాప్యం అంటే న్యాయాన్ని తిరస్కరించడమే అవుతుంది. ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే ఈ కేసు రాజకీయ లాబీయింగ్‌లో చిక్కుకుపోయినట్లు కనిపిస్తోంది. అధికారం అండతో చట్టం నుంచి తప్పించుకోవచ్చనే నమ్మకాన్ని నేరస్తులకు కలిగించడం ప్రమాదకరం.

# ‘డబుల్ ఇంజిన్’ అంటే పేపర్ల లీకేజీయేనా?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ అనుసరిస్తున్న విధానాలు దేశవ్యాప్తంగా నిరుద్యోగుల పాలిట శాపంగా మారాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నిప్పులు చెరిగారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువులో బుధవారం నిర్వహించిన ‘ప్రజా దర్బార్’ వేదికగా ఆయన కమలదళంపై విమర్శల యుద్ధం ప్రకటించారు. ‘డబుల్ ఇంజిన్’ సర్కార్ అంటే అభివృద్ధిలో వేగం అనుకుంటే.. అది కాస్తా పేపర్ల లీకేజీల్లో రికార్డులు సృష్టిస్తోందని ఎద్దేవా చేశారు. అసమర్థ పాలనతో లక్షలాది మంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును కేంద్రం అంధకారంలోకి నెట్టేసిందని దుయ్యబట్టారు. ఢిల్లీ పాలకుల వైఫల్యం వల్ల దేశం మొత్తం నిరుద్యోగ సెగలతో రగిలిపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల బాధ్యతారాహిత్యం వల్ల యువత కలలు కల్లలవుతున్నాయని.. దీనికి బీజేపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షా పత్రాల లీకేజీ ఉదంతం దేశ విద్యా వ్యవస్థకే మచ్చ తెచ్చిందని పొంగులేటి మండిపడ్డారు. పరీక్ష ప్రారంభానికి సుమారు 42 గంటల ముందే ప్రశ్నపత్రాలు బయటకు రావడం చూస్తుంటే వ్యవస్థలు ఎంతలా భ్రష్టుపట్టాయో అర్థమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా దాదాపు 23 లక్షల మంది విద్యార్థులు ఈ మెగా స్కామ్ వల్ల రోడ్డున పడ్డారని.. మన రాష్ట్రంలోనూ 70 వేల మంది బాధితులుగా మిగిలారని గణాంకాలతో వివరించారు. కష్టపడి చదివిన విద్యార్థుల కంటే.. అడ్డదారిలో పేపర్లు కొన్నవారికే సీట్లు దక్కే పరిస్థితి రావడం దారుణమన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే పేపర్లు లీక్ చేసి నిరుద్యోగుల గొంతు కోయడమేనా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ కుంభకోణం వెనుక ఉన్న అసలు సూత్రధారులను కఠినంగా శిక్షించడంలో కేంద్రం మీనమేషాలు లెక్కించడంపై ఆయన ఫైర్ అయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును సైతం మంత్రి తీవ్రస్థాయిలో ఎండగట్టారు. గత పదేళ్ల పాలనలో గ్రూప్ 1 నుంచి గ్రూప్ 4 వరకు ప్రతి పరీక్షా పత్రం లీక్ అయిందని ఆరోపించారు. ఆనాటి ప్రభుత్వ పెద్దల అండదండలతో మంత్రుల వ్యక్తిగత సహాయకులే జిరాక్స్ సెంటర్లలో పేపర్లు అమ్ముకున్నారంటే పరిస్థితి ఎంత దిగజారిందో ఊహించుకోవచ్చన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన పరీక్షల నిర్వహణ లోపాల వల్ల నిరుద్యోగులు మానసిక వేదనకు గురయ్యారని గుర్తు చేశారు. ముఖ్యంగా ఇంటర్మీడియట్ ఫలితాల తారుమారు వల్ల 28 మంది అమాయక విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం ఆనాటి ప్రభుత్వ వైఫల్యానికి పరాకాష్ట అని విమర్శించారు. నేడు కేంద్రంలోని బీజేపీ సైతం అదే బాటలో పయనిస్తూ యువత ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు పార్టీల డీఎన్ఏ ఒకటేనని.. అందుకే నిరుద్యోగుల బాధలు వీరికి పట్టడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియామక సంస్థల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిందని మంత్రి వివరించారు. టీఎస్‌పీఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేసి.. రాజకీయ జోక్యం లేని పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేశామని గర్వంగా చెప్పారు. తాము బాధ్యతలు చేపట్టిన స్వల్ప కాలంలోనే ఎక్కడా చిన్న పొరపాటుకు తావులేకుండా 70 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని వెల్లడించారు. ఉద్యోగాల జాతర కొనసాగిస్తూ నిరుద్యోగుల్లో భరోసా నింపుతున్నామని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ రంగంలో అవకాశం కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. పేపర్ లీకేజీలకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని.. అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. తమ ప్రభుత్వం యాక్షన్ మోడ్‌లో ఉందని.. ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి తీరుతామని పునరుద్ఘాటించారు. జీళ్లచెరువు క్లస్టర్ పరిధిలోని 13 గ్రామ పంచాయతీల నుంచి తరలివచ్చిన ప్రజల సమస్యలను పొంగులేటి నేరుగా విన్నారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన ప్రతి ఫిర్యాదును స్వయంగా స్వీకరిస్తూ అధికారులకు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పెన్షన్లు, భూ సంబంధిత సమస్యలపై పెద్ద ఎత్తున వినతులు అందాయి. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారమే పరమావధిగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. న్యాయమైన ప్రతి అభ్యర్థనను నూరు శాతం పరిష్కరిస్తామని.. ఎవరికీ అన్యాయం జరగనివ్వబోమని మాట ఇచ్చారు. అధికారులు సైతం అలసత్వం వహించకుండా ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. పాలనను ప్రజల వద్దకు తీసుకురావడమే ప్రజా దర్బార్ ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పొంగులేటి స్పష్టం చేశారు. ఇప్పటికే రైతు రుణమాఫీ ప్రక్రియను విజయవంతంగా అమలు చేస్తూ అన్నదాతలకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బంది కలగకుండా పటిష్టమైన ఏర్పాటు చేశామని వివరించారు. గత ప్రభుత్వం రైతులకు చేసిన అన్యాయాన్ని సరిదిద్దుతున్నామని పేర్కొన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నామని వెల్లడించారు. అభివృద్ధి పనుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని.. నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యంతోనే పేదల బతుకులు మారుతాయని.. సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా ప్రతి గడపకు చేరుతాయని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాను మోడల్ జిల్లాగా తీర్చిదిద్దుతామని ప్రతినబూనారు. అధికార మదంతో సామాన్యులను ఇబ్బంది పెడితే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. అటు కేంద్రంలోని బీజేపీ.. ఇటు రాష్ట్రంలోని విపక్ష బీఆర్ఎస్ పార్టీలు కేవలం సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాయని మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలను గ్రహించి మాట్లాడాలని సూచించారు. ప్రజల తీర్పును గౌరవించకుండా పాలనకు అడ్డుతగులుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు చేసినా ప్రజల ఆశీస్సులు తమ ప్రభుత్వానికి ఉన్నాయని ధీమా వ్యక్తం చేశారు. నిరుద్యోగులు, విద్యార్థుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని.. పేపర్ లీకేజీల సంస్కృతిని పూర్తిగా అంతం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. నీట్ స్కామ్ బాధితులకు న్యాయం జరిగే వరకు తమ గళం వినిపిస్తామని చెప్పారు. పారదర్శకమైన పాలనతో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతామని పొంగులేటి శ్రీనివాస రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు.



## చీరల పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**విశాలభారతి, గోదావరిఖని:** ప్రతి మహిళను కోటీశ్వరురాలు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తున్నదని రామగుండం శాసన సభ్యులు ఎం ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. బుధవారం ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని 46 వ డివిజన్ ఇందిరా నగర్ లో ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళను మహాలక్ష్మి గా గౌరవిస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నదని అన్నారు. ప్రతి మహిళా తన కాళ్ళ మీద తను నిలబడడానికి ఎలాంటి పూచీకత్తు లేకుండా సబ్సిడీ రుణాలను ఇస్తూ ప్రోత్సహిస్తున్నదని అన్నారు.స్వశక్తి మహిళలు ముందుకు వస్తే రుణాలు ఇప్పించి సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు మొదలైన స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించడానికి సంపూర్ణ సహకారం అందిస్తుందని అన్నారు. ఆర్ టి సి ఉచిత ప్రయాణం మహిళలు సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెపుతున్నారని అన్నారు. రూ 500 సబ్సిడీ గ్యాస్ కూడా పేదలకు ఎంతగానో ఉపయోగపడుతున్నారని అన్నారు. ఎన్నికల్లో వాగ్దానం చేయకున్నా ఎన్నో కొత్త పథకాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్నారని అన్నారు.ఇల్లు లేని ప్రతి నిరుపేదకు వెదికి వెదికి మరీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నామని అన్నారు. స్థలం ఉన్న వారు అక్కడే కట్టుకోవచ్చని ,లేనివారికి స్థలం ఇచ్చి ఇందిరమ్మ పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల ఆర్థిక సహాయం కూడా ఇస్తున్నామని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సంక్షేమ పథకాలను అర్హులు ఉపయోగించుకోవాలని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మేయర్ మహంకాళి స్వామి గత ప్రభుత్వం తరహాలో కాకుండా తమ ప్రభుత్వం నాణ్యమైన, మన్నికైన చీరలను పంపిణీ చేస్తున్నదని గమనించాలని అన్నారు. పేదలు ఎక్కువగా నివసించే ఇందిరా నగర్ ప్రాంతంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా మొదటగా చీరల పంపిణీ చేపట్టి కార్యక్రమాన్ని ప్రారంభించిడం పట్ల డివిజన్ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఈ సంధర్భంగా పలువురికి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ అధికారులతో పాటు మెప్మా సిబ్బంది,పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలి



**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

**విశాలభారతి, గోదావరిఖని:** కాలువలపై అక్రమ నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని రామగుండం శాసన సభ్యులు ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ కోరారు. వార్డు సందర్శనలో భాగంగా నగర మేయర్ మహంకాళి స్వామితో కలిసి బుధవారం 51 వ డివిజన్ అశోక్ నగర్,లక్ష్మి నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలపై అక్రమ నిర్మాణాల మూలంగా ప్రవాహ పరిమాణం పెరిగినప్పుడు నీళ్లు ఇళ్లలోకి రావడం, నీరు నిలిచి పోయి దుర్గంధం వ్యాపించి ప్రజలు అనారోగ్యానికి గురికావడం జరుగుతుందని అన్నారు. అలాగే వీధిలోకి అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ ,ఆటో వచ్చేలా విశాలంగా ఉంచుకోవాలని సూచించారు. ఖాళీ స్థలం కనబడితే చెత్త వేయడం సరికాదని అన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడవేసిన వారికి భారీ జరిమానాలు విధించాలని అన్నారు. పదేండ్లుగా కాలువల్లో నిలిచిపోయిన సిల్ట్ ను స్పెషల్ డ్రైవ్ ప్రారంభించి తొలగింపు ప్రక్రియ చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ నెలా పదిరోజులుగా జరుగుతున్న ఈ పనుల్లో పాలు పంచుకుంటున్న మేయర్,డిప్యూటీ మేయర్,కార్పొరేటర్లు, అధికారులు,సిబ్బందిని ఆయన అభినందించారు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది బాగా పని చేస్తున్నారని కితాబునిచ్చారు.లక్ష్మీ నగర్ రోడ్లను విశాలంగా తీర్చిదిద్దే ప్రక్రియ చురుగ్గా సాగుతున్నదని త్వరలో గణేష్ నగర్ వైపు రోడ్డు నిర్మాణం ప్రారంభం అవుతుందని అన్నారు. సహకరిస్తున్న వ్యాపారులకు కృతజ్ఞతలు తెలిపారు.నగరాన్ని విద్యా, వైద్య, వ్యాపార కేంద్రంగా, అద్భుత నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం లో రామగుండం నగరవాసులందరూ భాగస్వాములు కావాలని అన్నారు. తమ స్వంత ఇంటి లాగా నగరాన్ని కూడా పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. ఈ సంధర్భంగా అశోక్ నగర్ లో మురుగు నీటి కాలువలో జరుగుతున్న పూడిక తీత పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. నీళ్లు సాఫీగా ప్రవహించడానికి, ఎప్పటికప్పుడు యంత్రాలు ఉపయోగించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు రామగుండం నగర పాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ నాయకులు

**నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన పార్టీ ప్రతినిధులు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** బుధవారం రోజు A1 PALACE ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సిపిఐ పార్టీ నాయకురాలు కొత్తూరు సుభద్ర సుధాకర్ తమ్ముడు వివాహ మహోత్సవ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డి, సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్టు మండల కార్యదర్శి అజ్మీర హరి సింగ్ నాయక్, ఆర్ఎన్ఆర్ కాలనీ ఫేజ్ 2 శాఖ కార్యదర్శి చిర్రా శేఖర్ కవిత, సైదులు ముదిరాజ్, నన్నే సాబ్, బట్టల అనసూయ కుమార్ నాగమణి తదితరులు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా నాయకులు కుటుంబ సభ్యులను అభినందిస్తూ, దంపతుల దాంపత్య జీవితం ఆనందమయం కావాలని ఆకాంక్షించారు.

## ఆర్టీసీ మజ్దూర్ కాలనీలో నూతన సీసీ రోడ్ల పరిశీలన

**అభివృద్ధి పనులతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు – కళ్లెం నవజీవన్ రెడ్డి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని RTC మజ్దూర్ కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్ల పనులను స్థానిక మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. నాణ్యత ప్రమాణాలతో పనులు పూర్తి చేసిన అధికారులను, సిబ్బందిని అభినందించారు. హయత్ నగర్ డివిజన్ సమగ్ర అభివృద్ధి కోసం తాము ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తామని, ప్రజలకు మరింత మెరుగైన మౌలిక వసతులు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సూర్య నాయక్, కమిటీ సభ్యులు జంగయ్య, శ్రీశైలం, శ్రీను, రాజా, బీజేపీ నాయకులు బాలు, అమల్, సురేష్ రెడ్డి తదితరులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

**రూ.28.09 లక్షలతో యూజీడీ పనులకు శంకుస్థాపన.. పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ**



**కూకట్‌పల్లి,విశాలభారతి:** వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని బాగ్ అమీర్ కాలనీ, పటేల్ కుంట పార్క్ వెనుక భాగంలో రూ.28.09 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బుధవారం శంకుస్థాపన చేశారు. జలమండలి అధికారులు, మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి ఆయన పనులను ప్రారంభించారు.బాగ్ అమీర్ కాలనీలో రూ.16.30 లక్షలు, పటేల్ కుంట పార్క్ వెనుక కాలనీలో రూ.12.60 లక్షలతో యూజీడీ పైప్‌లైన్ నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఏళ్ల నాటి డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నామని, నిత్యం పొంగే ప్రాంతాల్లో ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ నాణ్యతతో పనులు చేపట్టాలని, జాప్యం లేకుండా ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం హరిశంకర్, డీజీఎం శ్రీనివాసరాజు, మేనేజర్ అనిల్, మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

# గిరిజన వారసత్వ భూమిపై కబ్జా యత్నం

- **ఖబర్దార్ అంటూ వీరన్న నాయక్ హెచ్చరిక**
- **తూర్పు తండా రైతు కుటుంబ ఆవేదన**
- **14 ఎకరాల భూమిపై అక్రమ పంజా ప్రయత్నం**

**కురవి విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా తూర్పు తండా (మాదవాపురం) గ్రామానికి చెందిన అంగోతు గోల్యా కుటుంబానికి చెందిన వారసత్వ వ్యవసాయ భూమిపై భూకబ్జా దారులు కన్నేసిన ఘటన స్థానికంగా ఉద్రిక్తతకు దారితీసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, అంగోతు గోల్యా సుమారు 1978 సంవత్సరంలో మాదవాపురం గ్రామానికి చెందిన పెద్ది కేశవ రావు తండ్రి లక్ష్మీనారాయణ వద్ద నుండి సర్వే నంబర్లు 155/B/3, 152/A/4/5, 152/A/4లో మొత్తం 14 ఎకరాలు 10 గుంటల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించారు. అనంతరం ఆ భూమిని తన నలుగురు కుమారులు అంగోతు భీచ్య, భోజ్య, సక్రం, దీప్లాలకు



ఉమ్మడిగా అప్పగించారు.

**వ్యవసాయంతో జీవనం.. తర్వాత వలసల బాట**

అంగోతు గోల్యా కుటుంబం తరతరాలుగా ఆ భూమిని సాగు చేస్తూ జీవనం కొనసాగించింది. పెద్ద కుమారునికి ముగ్గురు కుమారులు రాంచంద్రు, వీరు, భద్రు జన్మించగా, రెండవ కుమారునికి ఐదుగురు కుమార్తెలు, మూడవ కుమారునికి ఒక కుమార్తె, నాలుగో కుమారునికి వెంకన్న, మోహన్, జగన్ అనే ముగ్గురు కుమారులు జన్మించారు. కుటుంబ సభ్యుల వివాహాలు, వ్యవసాయ ఖర్చులు పెరుగుతుండగా పంటలకు సరైన దిగుబడి రాక అప్పుల పాలయ్యారని, జీవనోపాధి కోసం కుటుంబ సభ్యులు పట్టణాలకు వలస వెళ్లాల్సి వచ్చిందని గ్రామస్థులు పేర్కొన్నారు.

**ఖాళీ భూమిపై అక్రమార్కుల కన్ను.**

కుటుంబ సభ్యులు పట్టణాల్లో ఉండడాన్ని ఆసరాగా చేసుకున్న కొంతమంది భూ కబ్జా దారులు ఖాళీగా ఉన్న భూమిని ఆక్రమించేందుకు కుట్ర పన్నినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. నకిలీ పత్రాలు సృష్టించి, భూమి చుట్టూ కానీలు బాది పెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారని తెలిపారు. ఈ విషయం చుట్టుపక్కల రైతులు గమనించి పట్టణంలో ఉన్న అంగోతు వీరన్న నాయక్‌కు సమాచారం అందించారు. వెంటనే గ్రామానికి చేరుకున్న వీరన్న నాయక్ తమ పూర్వీకుల భూమిపై జరుగుతున్న అక్రమ చర్యలను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**గిరిజన భూమి జోలికి వస్తే ఊరుకోం**

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన వీరన్న నాయక్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. "మా తాతలు, తండ్రులు కష్టపడి కొనుగోలు చేసిన భూమిని అక్రమంగా కబ్జా చేయాలని చూస్తే సహించేది లేదు. మేము లేని సమయంలో నకిలీ పత్రాలు సృష్టించి భూమిని ఆక్రమించాలనుకోవడం దౌర్జన్యం. గిరిజన వారసత్వ భూమిపై కన్నేస్తే చట్టపరంగా పోరాడతాం" అని అన్నారు. అలాగే తమ గిరిజన జాతి ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో గిరిజన సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

**కబ్జా దారులు వెనక్కి తగ్గాలని డిమాండ్**

"మా గిరిజనుల భూములను కబ్జా చేయాలని చూస్తే మా కుల నాయకులు, గ్రామ ప్రజలు చూస్తూ ఊరుకోరు. ఇప్పటికైనా భూ కబ్జా నిర్వాహకులు వెనక్కి తగ్గాలి. లేకపోతే కుటుంబ సభ్యులంతా కలిసి చట్టబద్ధంగా పోరాటం చేసి కబ్జా దారుల తాటా తీస్తాం" అని వీరన్న నాయక్ స్పష్టం చేశారు. ఈ ఘటనపై రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి అసలు యజమానుల హక్కులను పరిరక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



- **వేం నరేందర్ రెడ్డిని కలిసి వినతి పత్రం**
- **ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షులు**
- **సోమేశ్వర్ జిల్లా అధ్యక్షులు బాలాజీ**

**మహబూబాబాద్ జిల్లా విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ను వారి స్వగృహంలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సోమేశ్వర్ జిల్లా అధ్యక్షులు బాలాజీ, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. గత 22 సంవత్సరాలుగా ఆశ్రమ పాఠశాలల్లో సేవలు అందిస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ ఉపాధ్యాయులకు కనీస టైమ్ స్కేల్ అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తూ తక్షణమే క్రమబద్ధీకరించాలని వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాలోత్ సోమేశ్వర్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లో విద్యా వెలుగులు నింపేందుకు సి.ఆర్.టి ఉపాధ్యాయులు ఎన్నో కష్టనష్టాలు భరించి పనిచేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో సేవలందిస్తున్నప్పటికీ ఇప్పటికీ స్థిరమైన ఉద్యోగ భద్రత లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర కోఆర్డినేటర్ మరియు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు దారావత్ బాలాజీ నాయక్ మాట్లాడుతూ, గిరిజన విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ తమ సేవలకు తగిన గుర్తింపు లేకపోవడంతో ఉపాధ్యాయులు మానసిక ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని గిరిజన ఉపాధ్యాయుల సేవలను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి బాదావత్ శ్రీను, రాష్ట్ర కార్యదర్శి కీమా, జిల్లా నాయకులు నూనావత్ వీరన్న తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. గిరిజన విద్యా వ్యవస్థ బలోపేతానికి ఉపాధ్యాయుల సేవలు కీలకమని, వారి సమస్యల పరిష్కారంతో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని నాయకులు అభిప్రాయపడ్డారు.

## శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు









**అనధికార నగదు స్వాధీనం – అక్రమాలపై ఉక్కుపాదం**

**రాజేంద్రనగర్, విశాలభారతి :**

శంషాబాద్ మండల తహసీల్దార్ & ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖ (ACB) అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో పలు తీవ్రమైన అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. మే 8, 2026 నుంచి చేపట్టిన సడెన్ చెక్‌లో కార్యాలయ నిర్వహణలో అవకతవకలు, అనధికార నగదు, ప్రజా సేవల్లో ఆలస్యం వంటి అంశాలు బయటపడ్డాయి. తహసీల్దార్ కె. రవీందర్ దత్ కార్ డాష్‌బోర్డ్‌లో లెక్కల్లో చూపని రూ.60,000 నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జి. కృష్ణ వద్ద రూ.29,650 నగదు లభించగా, తనిఖీల సమయంలో దాన్ని పడేయడానికి ప్రయత్నించినట్లు ACB అధికారులు తెలిపారు. లైసెన్స్డ్ సర్వేయర్ ఎస్.పృథ్వీరాజ్ వద్ద కూడా రూ.10,000 అనధికార నగదు గుర్తించారు. కార్యాలయంలో క్యాష్ రిజిస్టర్ నిర్వహణ లేకపోవడం, ఫైళ్లను దాచిపెట్టడం వంటి అంశాలు అధికారుల పనితీరుపై అనుమానాలకు తావిచ్చాయి. ముఖ్యంగా, ప్రజలకు సేవలు అందించాల్సిన 'మీ సేవ' దరఖాస్తుల్లో 68 అప్లికేషన్లు గడువు దాటినా పెండింగ్‌లో ఉండటం పరిపాలనా నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేసింది. ఇక తహసీల్దార్ తన అధికార పరిధి దాటి ఉత్తర్వులు జారీ చేసినట్లు కూడా ACB గుర్తించింది. పై అధికారులకు తెలియకుండా సర్టిఫికెట్లు జారీ చేయడం, ల్యాండ్ రిఫార్మ్స్ ట్రైబ్యునల్ అధికారాలను స్వయంగా వినియోగించడం వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి. శంషాబాద్, తొండుపల్లి, సాతంరాయి గ్రామాలకు చెందిన ప్రభుత్వ భూముల విషయంలో కూడా అనుమానాస్పద నిర్ణయాలు తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నిర్ణయాలు ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చి ప్రభుత్వానికి నష్టం కలిగించే అవకాశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ACB అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, లంచం డిమాండ్ చేసే ప్రభుత్వ ఉద్యోగులపై వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1064 లేదా వాట్సాప్ 9440446106 ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

## ప్రకాష్‌నగర్‌లో వైభవంగా హనుమాన్ జయంతి



ప్రత్యేక పూజలు పాల్గొన్న భక్తులు



అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు సంపత్

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** హఫీజ్‌పేట్ డివిజన్ ప్రకాష్‌నగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు సంపత్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం, పరివార దేవతార్చన, పుణ్యాహవాచనం, పూర్ణాహుతి నిర్వహించారు. స్వామివారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.సాయంత్రం జెండా ఆవిష్కరణ అనంతరం స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది. రథంపై ఊరేగుతూ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. హనుమాన్ జయంతి రోజు స్వామిని దర్శిస్తే సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. చింతకింది పవన్ గౌడ్ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక అభిషేకం, అలంకరణ చేయించారు. కార్యక్రమంలో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుంది




**మేకల సారంగపాణి**

**సికింద్రాబాద్, విశాలభారతి :** రేక్కడితే గానీ డొక్కాడని ఎంతో మంది పేద మధ్య తరగతి చిరు కాంట్రాక్టర్లు, కార్మికులు సెంట్రింగ్ వ్యవస్థ మీద ఆధారపడి బతుకుతున్నారు. వీరి పరిస్థితులు ముందు గొయ్యి వెనుక బావి అన్న చందంగా మారిందని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. వీరి న్యాయమైన డిమాండ్ల కోసం హక్కుల కోసం భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని సారంగపాణి భరోసా ఇచ్చారు. వీరు చేసే ఆందోళనలు బంద్ ల కార్యక్రమానికి పూర్తి మద్దతు ఇస్తామని అన్నారు. బడా బిల్డర్లు, ఇతరులు వీరి ఉద్యమానికి సహకరించాలని పిలుపునిచ్చారు. సెంట్రింగ్ కార్మికులు కాంట్రాక్టర్లు ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఎంతోమంది ప్రమాదానికి గురైనారని ప్రాణాలు కూడా కోల్పోయారని మేకల సారంగపాణి అన్నారు. కేంద్ర మంత్రులు గంగాపురం కిషన్ రెడ్డి తో, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు ఎన్.రామచంద్ర రావు తో సమస్యలు వివరించినమని మీ పోరాటానికి మద్దతు ఇస్తారని మేకలసారంగపాణి అన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రింగ్ కాంట్రాక్టర్లు,కార్మికులు చైర్మన్ ఏ.యాదగిరి, అధ్యక్షులు అంజయ్య, అశోక్, ఎం.యాదగిరి,నరసింహ, రాము, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## రఘునాథ్ యాదవ్‌కు సన్మానం



రఘునాథ్ యాదవ్ నువ్వు సన్మానిస్తున్న కాంగ్రెస్ నేత బలరాం యాదవ్

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన మారబోయిన రఘునాథ్ యాదవ్‌ను శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బలరామ్ యాదవ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. నగరంలోని కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రఘునాథ్ యాదవ్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బలరామ్ యాదవ్ మాట్లాడుతూ మిత్రులు, శ్రేయోభిలాషి అయిన రఘునాథ్ యాదవ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నిక కావడం యాదవ సామాజిక వర్గానికి గర్వకారణమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి కట్టుబడి ఉందని, కార్పొరేషన్ ద్వారా యాదవుల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి, విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్ రెడ్డికి, పీసీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. యాదవ సోదరుల అభ్యున్నతి కోసం కార్పొరేషన్ నిధులను పారదర్శకంగా వినియోగిస్తూ, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, యాదవ సంఘం ప్రతినిధులు, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# మాదాపూర్‌లో విషాదం!



విద్యార్థిని పూజా రెడ్డి (ఫైల్ ఫోటో)

**శ్రీ చైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య**

**సైబరాబాద్ - విశాలభారతి:**

మాదాపూర్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ హాస్టల్‌లో ఎంపీసీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని పూజా రెడ్డి (16) ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన పూజా రెడ్డి ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినా, బెటర్‌మెంట్ కోసం మళ్లీ పరీక్షలకు సిద్ధమవుతోంది. ఇవాళ (మే 13) నుంచి బెటర్‌మెంట్ పరీక్షలు ప్రారంభం కావాల్సి ఉండగా, నిన్న రాత్రి హాస్టల్ గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.తోటి విద్యార్థులు గమనించి వార్డెన్‌కు తెలియజేయడంతో, హాస్టల్ సిబ్బంది మాదాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.పూజా తండ్రి గోపి రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.ప్రాథమిక విచారణలో పరీక్షల మానసిక ఒత్తిడి కారణంగా ఈ విషాదం జరిగినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. పూర్తి కారణాలు పోస్ట్‌మార్టం నివేదిక దర్యాప్తు అనంతరం వెల్లడికానుంది. కుటుంబ సభ్యులు, సహచర విద్యార్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

**కార్పొరేట్ కాలేజీల్లో ఒత్తిడి సమస్య..!**

శ్రీ చైతన్య, నారాయణ వంటి ప్రముఖ కోచింగ్ సంస్థల్లో విద్యార్థులపై తీవ్రమైన మార్కులు,ర్యాంకుల ఒత్తిడి, హ్యారస్‌మెంట్ వల్ల ఇలాంటి ఘటనలు గతంలోనూ ఎన్నో జరిగాయి. ఈ విషయం విద్యా వ్యవస్థ, కుటుంబాలు, సమాజం అందరూ ఆలోచించాల్సిన ముఖ్యమైన అంశం.ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా అధికారులు, సంస్థలు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి సీతక్క, వేం నరేందర్ రెడ్డి
- అధిక నిధుల మంజూరు
- నిరంతరం అభివృద్ధి దిశగా ప్రభుత్వం







**మహబూబాబాద్ జిల్లా విశాలభారతి:** బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, అధ్యక్షతన జిల్లా స్థాయి అభివృద్ధి పనుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ మంచినీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ధనసరి అనసూయ సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మహబూబాబాద్ శాసనసభ్యులు, మహబూబాబాద్ ఎం.పి పోరిక బలరాం నాయక్, డాక్టర్ భూక్య మురళి నాయక్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వేసవి తీవ్రత నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలలో అత్యంత అధిక ప్రాధాన్యతగా త్రాగునీటి సమస్య రాకుండా క్షేత్రస్థాయిలో పంచాయతీరాజ్ గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ జిల్లా యంత్రాంగం పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు సాగాలని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించినందున పద్దుల వారీగా ఖర్చులు చేసి అభివృద్ధికి కృషి చేయాలని, ప్రస్తుతం ధాన్యం మొక్కజొన్నల కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వచ్చిన లక్ష్యాన్ని చేరుకోవాలని, ఐకెపి ఆధ్వర్యంలో కొనసాగుతున్న దాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీల వ్యవస్థలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం అధిక నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి దిశగా పయనిస్తుందని నిత్యం గ్రామాలు పట్టణాల పేద ప్రజల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, దేశంలో ఎక్కడా లేని విధంగా వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామన్నారు, కొంతమంది అభివృద్ధి పనులపై దుష్ప్రచారం చేస్తున్నారని అట్టివారిని సహించేది లేదన్నారు, రానున్న వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని నూతన లైన్లు ఇతర సమస్యలు వెంటనే పరిష్కరించుకోవాలని అన్నారు, ముఖ్యమంత్రి సలహాదారు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ వచ్చే జూన్ మాసంలో జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లాలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజ్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయం, ఉద్యానవన శాఖ యూనివర్సిటీ, జెఎన్టియు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల భవన నిర్మాణాలు, ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి, మున్సిపల్ తదితర శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వేగం పెంచి ప్రారంభోత్సవం శంకుస్థాపనలకు సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు, గత సీజన్ తో పోల్చుకుంటే ఈ సీజన్లో మరి ధాన్యం, మొక్కజొన్నల దిగుబడి అధికంగా ఉన్నందున అందుకు తగిన విధంగా క్షేత్రస్థాయిలో సిబ్బందిని హమాలీలను లారీలను, ట్రాక్టర్స్, డీసీఎం, తదితర సదుపాయాల ద్వారా ధాన్యాన్ని, మొక్కజొన్నలను కొనుగోలు చేసి వెంట వెంటనే తరలించాలని సూచించారు. పంట మార్పిడి విధానం పై రైతులకు అవగాహన కల్పించాలని ధాన్యంతో పాటు ఇతర వాణిజ్య పంటలను సాగు చేసేందుకు ప్రోత్సహించాలని తద్వారా రైతులకు అధిక లాభాలు వస్తాయని కోతుల బెడద కూడా లేకుండా ఉంటుందని సూచించారు. జిల్లాలోని ఐదు మున్సిపల్ ప్రాంతాల అభివృద్ధి కోసం సుమారు 150 నుండి 200 కోట్ల నిధులతో పనులు జరుగుతున్నాయని, అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలిస్తూ ఉంటూ ఉండాలని సూచించారు, జిల్లాలో కొంతమంది నిరుపేదలు అటవీ భూములు, పోడు భూముల సమస్యలు ఉన్నందున అర్హులైన నిరుపేదలు అట్టి భూములలో నివాస స్థలాలు ఏర్పరచుకొని ఉన్నారని వారిని అటవీశాఖ అధికారులు కొంత ఇబ్బందులకు గురిచేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, పేద ప్రజల ను ఇబ్బందులకు గురి చేయవద్దని ప్రభుత్వ అధికారులు సహకరించాలని కోరారు, మక్కలు, ధాన్యం కొనుగోళ్లలో కొంతమంది కావాలని అసత్య ప్రచారాలు చేస్తున్నారని అందుకు అధికారులు వారు చేస్తున్న పనుల వివరాలను వెంటవెంటనే తెలియపరచాలని సూచించారు, జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఎవరైనా కబ్జాలకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్కు సూచించారు, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ మాట్లాడుతూ జిల్లాలో మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లలో అధికారులు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించడం కోసం ముందస్తు చర్యలు తీసుకొని సాగాలన్నారు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోల పనితీరులలో పారదర్శకంగా వ్యవహరించి నిధులను సక్రమంగా వినియోగించే విధంగా పంచాయతీరాజ్ డిపిఓ చర్యలు తీసుకోవాలని సూచించారు. మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే నిధుల ద్వారా అభివృద్ధి సాధించుకోవాలని తెలిపారు. మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ జిల్లాలో మక్కలు, ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఇప్పటికే జిల్లాలో తక్కువ శాతం కొనుగోలు అయిందని తెలిపారు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ధాన్యం నిల్వల కోసం గోదాములను పరిశీలించాలని, ధాన్యాన్ని తరలించడం కోసం వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలని, హమాలీలను అధికంగా నియమించుకోవాలని సూచించారు. సమావేశానికి హాజరైన మంత్రి, రాజ్యసభ సభ్యులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులకు మక్కలు, దాన్యం కొనుగోళ్ల, అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు నిర్వహణ తీసుకుంటున్న చర్యలపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ కార్యాలయ) నిర్మాణం వివరాలను కోరగా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ ఇప్పటికే దాదాపుగా పూర్తయిన కార్యాలయ పనులలో పెండింగ్ ఉన్న వాటిని వెంటనే పూర్తి చేయుటకు చర్యలు తీసుకొని సంబంధిత అధికారులను ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. అనంతరం వారు చెప్పిన సూచనలు సలహాలు స్వీకరించుకుని సంబంధిత అధికారులకు జారీ చేసి ప్రత్యక్షంగా స్వయంగా పనులు సమస్యల పరిష్కారం నిమిత్తం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్, జిల్లా ఫారెస్ట్ అధికారి విశాల్ బత్తుల, అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి, మహబూబాబాద్ పట్టణ మున్సిపల్ చైర్పర్సన్ గుగులోతు జ్యోతి, కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవ రెడ్డి, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జడ్పీ సీఈవో పురుషోత్తం, అన్ని విభాగాల జిల్లా అధికారులు, డోర్నకల్, మరిపెడ తొర్రూరు, కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్లు , వైస్ చైర్మన్లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ కష్టాలు తీరే వేళ.. బాచుపల్లి ఫ్లైఓవర్ ప్రారంభానికి సిద్ధం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న మియాపూర్ - బాచుపల్లి ఫ్లైఓవర్

**మియాపూర్,విశాలభారతి:** ఏళ్ల తరబడి ట్రాఫిక్ జామ్‌లతో సతమతమవుతున్న మియాపూర్, బాచుపల్లి ప్రజలకు తీపికబురు. హెచ్ఎండీఏ రూ.141 కోట్ల వ్యయంతో నిర్మించిన 1.3 కి.మీ. సిక్స్‌లేన్ బాచుపల్లి జంక్షన్ ఫ్లైఓవర్ పనులు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఈ నెలలోనే ఫ్లైఓవర్‌ను ప్రారంభించి ప్రజలకు అంకితం చేయనున్నారు.ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే మియాపూర్, నిజాంపేట్, గండి మైసమ్మ, ఆల్విన్ ఎక్స్ రోడ్ల మార్గంలో నిత్యం గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకునే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులకు పెద్ద ఊరట లభిస్తుంది. మియాపూర్ నుంచి ఆల్విన్ వరకు సిగ్నల్ ఫ్రీగా వెళ్లే అవకాశం రావడంతో ప్రయాణ సమయం సగానికి పైగా తగ్గుతుంది. దీనివల్ల ఇంధనం, డబ్బు ఆదా కావడంతో పాటు రోడ్డు ప్రమాదాలు కూడా గణనీయంగా తగ్గుతాయని స్థానికులు ఆశిస్తున్నారు.ఇదొక్కటే కాకుండా మొత్తం రూ.384 కోట్లతో మియాపూర్‌ఆల్విన్ మధ్య మరో సిక్స్‌లేన్ ఫ్లైఓవర్, హఫీజ్‌పేట్‌మియాపూర్, బాచుపల్లిఆల్విన్ మధ్య అండర్‌పాస్‌ల నిర్మాణం కూడా జరుగుతోంది. ఒక్క బాచుపల్లి ఫ్లైఓవర్ నిర్మాణానికే రూ.71 కోట్లు ఖర్చు చేశారు.దీర్ఘకాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, హెచ్‌ఎండీఏకు స్థానికులు, కాలనీ సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లను అధికారులు ముమ్మరం చేశారు.

## సీఐకి 2026 జర్నలిస్ట్ డైరీ అందజేత



జర్నలిస్టుల డైరీని సీఐ విజయ్ అందజేస్తున్న శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు

**చందానగర్, విశాలభారతి:** శేరిలింగంపల్లి జర్నలిస్టుల డైరీ 2026ను బుధవారం చందానగర్ సీఐ సుంకర విజయ్‌కు అందజేశారు. టీయూడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా శాఖ రూపొందించిన డైరీని జర్నలిస్టులు సీఐకు అందించి, ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసు, మీడియా సమన్వయం అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా సీఐ సుంకర విజయ్ మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. నిజాన్ని నిర్భయంగా వెలికితీసి ప్రజలకు అందించడమే వారి ప్రధాన విధి అని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు పోలీసులకు మీడియా సహకారం ఎప్పుడూ అవసరమని పేర్కొన్నారు. నిష్పక్షపాతంగా, బాధ్యతగా వ్యవహరిస్తూ సమాజ శ్రేయస్సు కోసం పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ జాయింట్ సెక్రటరీ సాద నరేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ యాసిన్, కార్యవర్గ సభ్యులు మహేందర్, బసవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సెంట్రింగ్ కార్మికులకు మద్దతు తెలిపిన బిజెపి నాయకుడు రవి ప్రసాద్ గౌడ్

**సికింద్రాబాద్, విశాలభారతి :** సీతాఫల్మండి సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అంబాల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో సెంట్రింగ్ కార్మికుల సమస్యలపై మే 16వ తేదీ నుండి బంద్ పాటిస్తున్నందున వారికి భారతీయ జనతా పార్టీ తరపున మద్దతు తెలుపుతున్నామని పి.రవి ప్రసాద్ గౌడ్ తెలిపారు.అలాగే వారసిగూడ పార్సిగుట్ట సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సెంట్రింగ్ కార్మికుల సమస్యలపై మే 16వ తేదీ నుండి బంద్ పాటిస్తున్నందున వారికి భారతీయ జనతా పార్టీ తరపున పి.రవి ప్రసాద్ గౌడ్ మద్దతుతెలిపారు.



## మే 16న సెంట్రింగ్ పనులు బంద్

- సెంట్రింగ్ రేట్లు పెంచాలి
- కార్మికుల సమస్యల పరిష్కరించాలి
- సీతాఫల్మండి సెంట్రింగ్ కాంట్రాక్టర్స్
- అసోసియేషన్ అధ్యక్షులు అంబాల రాజేశ్వరరావు

**ముషీరాబాద్, విశాలభారతి:** సెంట్రింగ్ రేట్లు పెంచాలని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీతాఫల్మండి సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 16న సెంట్రింగ్ పనులు బంద్ కు పిలుపు నిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షులు అంబాల రాజేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం అసోసియేషన్ కార్యాలయం ముందు బంద్ పోస్టర్ను ఆవిష్కరించారు. అనంతరం బిజెపి మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణిని కలిసి సెంట్రింగ్ కాంట్రాక్టర్లు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం అంబాల రాజేశ్వరరావు మాట్లాడుతూ సీతాఫల్మండి సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికులు గత కొంతకాలంగా నిర్మాణ రంగంలో ఆర్థిక పరమైన ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో ముడి సరుకుల ధరలు రవాణా ఖర్చులు నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, కానీ గత కొన్ని నెలలుగా సెంట్రింగ్ పనులకు చెల్లిస్తున్న రేట్లు మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనితో కాంట్రాక్టర్లు వందలాది మంది కార్మికులు ఆధారపడిన కుటుంబాలు గడపడం కష్టంగా మారిందన్నారు. వెంటనే ఖర్చులకు అనుగుణంగా సెంట్రింగ్ రేట్లు పెంచాలని, కార్మికుల సంక్షేమ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పని ప్రదేశాల్లో ఎదురవుతున్న ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసమే మే 16న సెంట్రింగ్ పనులు నిలిపివేసి నిరసన తెలుపుతున్నామని దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రవికుమార్, నర్సింగ్ రావు, శ్రీనివాస్ రావు, సుబ్బారావు, సోమయ్య, సిద్దయ్య, యాదగిరి, లక్ష్మీనరసు, వెంకటేష్, లింగం, హుస్సేన్, సంపత్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్వింటాకు ఐదు కిలోల తరుగు రైతులను నిలువు దోపిడీ చేయడమే



- తరుగు పేరుతో కోత పెట్టిన సొమ్మును వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలి
- ఆరుగాలం కష్టపడి పండించిన పంటపై కోతలు విధిస్తే సహించేది లేదు
- కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి
- అన్నదాతలకు జరుగుతున్న అన్యాయంపై ఉన్నతాధికారులు స్పందించాలి
- ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం

**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి :** ధాన్యం క్వింటాకు ఐదు కిలోల తరుగు తీయడం రైతులను నిలువు దోపిడీ చేయడమేనని, దీనిని వెంటనే నిలిపివేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని పెనగడప గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా ప్రతినిధిబృందం సందర్శించి, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి వస్తే, తరుగు పేరుతో అడ్డగోలుగా కోత విధిస్తూ అన్నదాతలను మోసం చేయడం అన్యాయమన్నారు. ఇప్పటివరకు కోత పెట్టిన ధాన్యం విలువను లెక్కకట్టి ఆ సొమ్మును తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. తరుగుపేరుతో రైతులకు జరుగుతున్న అన్యాయంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సరిపడా టార్పాలిన్లు, గిడ్డంగి సౌకర్యం, తాగునీరు, ఎండ తగలకుండా నీడ వంటి కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా ధాన్యం సేకరించాలని, నిబంధనలు అతిక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రతినిధి బృందంలో సంఘం నాయకులు సలిగంటి శ్రీనివాస్, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, నీడలా సుధాకర్, కట్ట నాగయ్య, ఉదయ్, నవీన్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## మే 16న సెంట్రింగ్ పనులు బంద్



**ముషీరాబాద్, విశాలభారతి:** సెంట్రింగ్ రేట్లు పెంచాలని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీతాఫల్మండి సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 16న సెంట్రింగ్ పనులు బంద్ కు పిలుపు నిస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షులు అంబాల రాజేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం అసోసియేషన్ కార్యాలయం ముందు బంద్ పోస్టర్ను ఆవిష్కరించారు. అనంతరం బిజెపి మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణిని కలిసి సెంట్రింగ్ కాంట్రాక్టర్లు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం అంబాల రాజేశ్వరరావు మాట్లాడుతూ సీతాఫల్మండి సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికులు గత కొంతకాలంగా నిర్మాణ రంగంలో ఆర్థిక పరమైన ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో ముడి సరుకుల ధరలు రవాణా ఖర్చులు నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, కానీ గత కొన్ని నెలలుగా సెంట్రింగ్ పనులకు చెల్లిస్తున్న రేట్లు మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనితో కాంట్రాక్టర్లు వందలాది మంది కార్మికులు ఆధారపడిన కుటుంబాలు గడపడం కష్టంగా మారిందన్నారు. వెంటనే ఖర్చులకు అనుగుణంగా సెంట్రింగ్ రేట్లు పెంచాలని, కార్మికుల సంక్షేమ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పని ప్రదేశాల్లో ఎదురవుతున్న ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసమే మే 16న సెంట్రింగ్ పనులు నిలిపివేసి నిరసన తెలుపుతున్నామని దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రవికుమార్, నర్సింగ్ రావు, శ్రీనివాస్ రావు, సుబ్బారావు, సోమయ్య, సిద్దయ్య, యాదగిరి, లక్ష్మీనరసు, వెంకటేష్, లింగం, హుస్సేన్, సంపత్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలిలో విషాదం

**లిఫ్ట్‌లో జుట్టు ఇరుక్కుని ఐదేళ్ల చిన్నారి మృతి.. తల్లిదండ్రుల రోదన**



**గచ్చిబౌలి,విశాలభారతి:** గౌలిదొడ్డిలోని మహి ఉమెన్స్ పీజీ హాస్టల్‌లో బుధవారం సాయంత్రం ఘోర విషాదం చోటుచేసుకుంది. లిఫ్ట్‌లో జుట్టు ఇరుక్కుపోవడంతో ఐదేళ్ల చిన్నారి బిస్తూ గోష్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఉపాధి కోసం వెస్ట్ బెంగాల్ నుంచి నగరానికి వలస వచ్చిన ఓ కుటుంబం ఈ హాస్టల్‌లో వంట పనులు చేసుకుంటూ జీవిస్తోంది. వారి కుమార్తె బిస్తూ గోష్ స్థానిక పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. బుధవారం సాయంత్రం గ్రౌండ్ ఫ్లోర్ నుంచి 5వ అంతస్తుకు లిఫ్ట్‌లో వెళ్తుండగా మూడో అంతస్తు వద్ద ఒక్కసారిగా చిన్నారి జుట్టు లిఫ్ట్ డోర్ల మధ్య ఇరుక్కుపోయింది. లిఫ్ట్ పైకి కదలడంతో తల దారుణంగా నలిగి చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. కొన్ని సెకన్ల వ్యవధిలోనే ఘటన జరగడంతో పాపను కాపాడే అవకాశం లేకపోయింది.సమాచారం అందుకున్న స్థానికులు డయల్ 100కు ఫోన్ చేయడంతో గచ్చిబౌలి పోలీసులు, హైడ్రా, ఫైర్ సర్వీసెస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన మృతదేహాన్ని బయటకు తీసేందుకు గంటకు పైగా శ్రమించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌కు తరలించారు.గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హాస్టల్ నిర్వాహకులు లిఫ్ట్ నిర్వహణలో నిర్లక్ష్యం వహించారా? పిల్లలు ఒంటరిగా లిఫ్ట్ ఉపయోగించకుండా జాగ్రత్తలు తీసుకోలేదా? అనే కోణాల్లో విచారణ చేస్తున్నారు. ఏకైక కూతురిని కోల్పోయిన తల్లిదండ్రుల రోదన అక్కడున్న వారిని కలచివేసింది.

## కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ: ఎమ్మెల్యే గాంధీ



కళ్యాణ లక్ష్మి చెక్కులు అందుకున్న లబ్ధిదారులు

**కూకట్‌పల్లి,విశాలభారతి:** కూకట్‌పల్లి మండలంలోని 47 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం కింద రూ.47,05,452 ఆర్థిక సాయాన్ని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బుధవారం అందజేశారు. వివేకానందనగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేశ్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల పెళ్లికి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోందని, దేశంలో ఎక్కడా లేని విధంగా కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీపై ఎస్ఎఫ్ఐ ఆగ్రహం

**ఎన్‌టీఏను వెంటనే రద్దు చేయాలని డిమాండ్**



**మొయినాబాద్, విశాలభారతి:** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ ఘటనపై భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, బాధ్యత లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో పేపర్ లీకేజీలు జరగడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆరోపించారు. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విశ్వసనీయమైన, పారదర్శకమైన ప్రజాస్వామ్య పరీక్షా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు.

## పెళ్లి పేరుతో మహిళా కానిస్టేబుల్‌కు మోసం.. ఎస్సై అరెస్టు

**సైబరాబాద్ విశాలభారతి:** పెళ్లి చేసుకుంటానని నమ్మించి తోటి మహిళా కానిస్టేబుల్‌ను లైంగికంగా వేధించిన కేసులో ఎస్సై సురేశ్‌ను కూకట్‌పల్లి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు.నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు బాలానగర్ ఏసీపీ నరేశ్ రెడ్డి తెలిపారు.కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేసిన సురేశ్ ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు.గతంలో సురేశ్, బాధిత మహిళా కానిస్టేబుల్ ఇద్దరూ కూకట్‌పల్లిలోని ఓ పోలీస్ స్టేషన్‌లో కలిసి విధులు నిర్వహించారు.ఆ పరిచయంతో పెళ్లి చేసుకుంటానని నమ్మించి మాయమాటలు చెప్పిన సురేశ్, ఆమెను లైంగికంగా వేధించాడని బాధితురాలు ఆరోపించింది. తాను మోసపోయానని గ్రహించిన మహిళా కానిస్టేబుల్ వెంటనే కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న వెంటనే కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.ఆధారాలు సేకరించిన అనంతరం బుధవారం నిందితుడు సురేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు ఏసీపీ నరేశ్ రెడ్డి వెల్లడించారు. కేసును అన్ని కోణాల్లో విచారిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. పోలీసు శాఖలో పనిచేస్తూనే తోటి మహిళా కానిస్టేబుల్‌ను మోసం చేశాడనే ఆరోపణలతో శాఖలో తీవ్ర చర్చ జరుగుతోంది. సస్పెన్షన్‌లో ఉండగానే ఇలాంటి కేసు నమోదు కావడంతో శాఖ పరువుకు భంగం కలిగిందని సీనియర్ అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. బాధితురాలికి పూర్తి న్యాయం చేస్తామని, నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.





## సమంత ‘మా ఇంటి బంగారం’

# కొత్త రిలీజ్ డేట్

### యాంగ్రీ లుక్‌తో అదిరిపోయిన పోస్టర్

స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ ‘మా ఇంటి బంగారం’పై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. ఫీమేల్ సెంట్రిక్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రముఖ దర్శకురాలు నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తుండటంతో సినీ అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. మొదట ఈ సినిమాను మే 15న విడుదల చేయాలని మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ మూవీ రిలీజ్ వాయిదా పడింది. దీంతో అభిమానులు కొత్త రిలీజ్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుండగా.. తాజాగా చిత్రబృందం అధికారిక ప్రకటనతో క్లారిటీ ఇచ్చింది. ‘మా ఇంటి బంగారం’ చిత్రాన్ని జూన్ 16న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సంప్రదాయ పట్టుచీరలో కనిపిస్తున్న సమంత చేతిలో తుపాకీ పట్టుకుని సీరియస్, యాంగ్రీ లుక్‌లో కనిపించడం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. పోస్టర్‌ను చూస్తుంటే సినిమాలో ఆమె పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందనే అభిప్రాయం అభిమానుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఈ సినిమాపై మంచి బజ్ ఏర్పడగా.. తాజా పోస్టర్ ఆ హైప్‌ను మరింత పెంచింది. ముఖ్యంగా సమంత గత కొంతకాలంగా విభిన్న కథలను ఎంచుకుంటూ నటిగా కొత్త కోణాలను చూపిస్తోంది. ఈ క్రమంలో ‘మా ఇంటి బంగారం’ కూడా ఆమె కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు సంతోష్ నారాయణ్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండటం మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు సినిమాకు అదనపు బలంగా నిలుస్తాయని అభిమానులు ఆశిస్తున్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.